www.aashwi.net / in

PRGI NO. TGMUL/26/A2874

ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

JOURNALISTS WANTED

- Aashwi Updates – Voice of the People
- Telangana & Andhra Pradesh
- District Bureau: Degree mandatory
- Mandal Reporters: Intermediate mandatory
- News writing & reporting skills required
- Interest in public issues preferred
- Honorarium: Based on experience & performance
- Join Aashwi Updates. Be the Voice of the People!

editor@aashwi.in

7207282727 | 72707292727



నేహా బోరా పిటిషన్ కొట్టివేత

5

శనివారం, 24-10-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :160 Issue :160 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in



తుమ్మిడిహెట్టిపై త్వరలో చర్చలు

- 152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మాణానికి ఒప్పించేలా వాదనలు
- చర్చలకు సానుకూలత తెలిపిన మహారాష్ట్ర సీఎం
- ఏడుల నుంచే డిండి, అచ్చంపేట ఎత్తిపోతలకు నీళ్లు
- పాలమూరు నీటికి గండి పడకుండా అదనపు నీటి తరలింపు
- శ్రీశైలం నుంచి ఏడుల వరకు అదనంగా 0.6 టీఎంసీల ఎత్తిపోతలు
- నీటిపారుదల ప్రాజెక్టుల సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

2

కరువుతో జాగ్రత్త!

- కరువు ఎదుర్కోవడంలో భాగస్వాములు కావాలి
- పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- ఎల్‌నినోపై టీపీసీసీ ఆధ్వర్యంలో పార్టీ ప్రజాప్రతినిధుల సమావేశం



హైదరాబాద్, అక్టోబర్ 23, ఆశ్వి అప్డేట్స్ :
రాష్ట్రంలో రానున్న రోజుల్లో ఎదురయ్యే ఎల్‌నినో కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు, ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేసేందుకు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎల్‌నినో అనేది భూతం కాదని, తీవ్రమైన కరువు పరిస్థితులని తెలిపారు. కేవలం మన రాష్ట్రమే కాక మహారాష్ట్ర,

మిగతా 2వ పేజీలో..

కరువును ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ

- ప్రభావిత మండలాల గుర్తింపు నుంచి నీటి సంరక్షణ వరకు పటిష్ట చర్యలు
- తాగు, సాగునీటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు
- అన్ని శాఖలూ అప్రమత్తంగా ఉండాలి: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

2

నేరాల కట్టడికి ఉమ్మడి కార్యాచరణ

- సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు
- అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణకు ప్రత్యేక సెక్రటేరియట్
- సైబర్ నేరాలు, డ్రగ్స్ అక్రమ రవాణాపై సమన్వయంతో పోరు
- పోలీసు సాంకేతికత, నేర నియంత్రణ విధానాలపై దక్షిణాది రాష్ట్రాల దృష్టి
- సైబర్ బాధితులకు రూ.69.4 కోట్ల రికవరీ

3



భద్రతే అభివృద్ధికి పునాది

- తెలంగాణ ప్రగతికి టీజీఎస్‌పీఎఫ్ రక్షణ కవచం
- 67 ప్రభుత్వ కీలక సంస్థలకు టీజీఎస్‌పీఎఫ్ భద్రత
- టీజీఎస్‌పీఎఫ్ సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

3



విఫలమైన ఉత్పత్తి'ని ప్రమోట్ చేసేందుకు దేశాన్ని పణంగా పెడతారా?

- కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు
- 'దిమాగీ నక్సల్స్' ఆ పార్టీ ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తున్నారు
- విదేశాల్లో భారత్ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని ఆరోపణ
- పార్లమెంటులో ఇతర ప్రతిపక్ష నేతల గొంతు నొక్కుతున్నారని వ్యాఖ్యలు

5



ఎల్ఏసీ వద్ద ఉద్రిక్తతలపై కేంద్రం స్పందన

- చైనా సైన్యం గస్తీ విధానాల నుంచి తప్పుకుంటే ఉద్రిక్తతలు: విదేశాంగ శాఖ
- సరిహద్దు సమస్యల పరిష్కారానికి భారత్-చైనా చర్చలు
- సరిహద్దు యూనిట్లలో డ్రోన్ ప్లాటూన్లు ఏర్పాటు
- గల్వాన్ తరహా పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక శిక్షణ

5



కాంగ్రెస్ ది అసమర్థ పాలన



- భరోసా ఇవ్వడం మానేసి బెదిరింపులా?
- ఆరునెలల్లో తీసుకున్న కరువు నివారణ చర్యలేంటి?
- నీళ్లు ఇవ్వలేమనడం పాలనా దక్షత అనిపించుకోదు
- విద్యుత్ కోతలతో ఎండుతున్న పంటలు
- అడ్డగోలుగా పెరుగుతున్న బియ్యం ధరలు
- ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషణలా?
- రేవంత్ వ్యాఖ్యలపై హరీష్ రావు ధ్వజం

3



'ఖేలో ఇండియా' నిర్వహణకు పక్కా కార్యాచరణ

- గ్రామీణస్థాయి నుంచే ప్రతిభావంతులైన క్రీడాకారుల గుర్తింపు
- క్రీడలు, యువజనుల శాఖల మంత్రి వాకిటి

3

ఇండ్ల కేటాయింపులో గుడిసెవాసులకే ప్రాధాన్యం



- అర్హులందరికీ న్యాయం చేయడమే లక్ష్యం
- రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి
- హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రాధాన్యతా క్రమంలో లబ్ధిదారుల ఎంపిక

3



కరువుపై జిల్లాలవారీగా కార్యాచరణ

- కలెక్టర్లకు తగిన నిధులు అందుబాటులో ఉంచాలి
- శాఖల సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలి
- మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:
రాష్ట్రంలో కరువు, ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు రాష్ట్ర, జిల్లాస్థాయిల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. జిల్లా కలెక్టర్లకు తగిన

మిగతా 2వ పేజీలో..



పాలాల్లో కన్నీటి ధార

- పంటలపై ఎల్‌నినో పంజా
- సాగునీటి కొరతతో ఎండిపోతున్న వరి
- ట్యాంకర్లతో నీళ్లు పారిస్తున్న రైతన్నలు

వరంగల్, అక్టోబర్ 23, ఆశ్వి అప్డేట్స్:
ఎండిపోతున్న పంటను చూసి తట్టుకోలేక, చెమటోడ్చి సాగుచేసిన వరి పొలాన్ని కాపాడుకునేందుకు అన్నదాతలు అరిగోస పడుతున్నారు. ఎల్‌నినో దెబ్బకు వర్షాలు లేక, కరెంట్ కోతలతో భూగర్భ జలాలు

మిగతా 2వ పేజీలో..

తల్లి కోసం 8 వేల కిలో మీటర్ల పరుగు

- తల్లి కోలుకోవడంతో మొక్కు తీర్చుకుంటున్న 19 ఏళ్ల మోనూ
- ఇప్పటివరకు ఆరు జ్యోతిర్లింగాల దర్శనం
- రోజుకు 50 కిలోమీటర్లు పరిగెత్తుతున్న బిహార్ యువకుడు
- మిగిలిన ఆరు క్షేత్రాల దర్శనం తర్వాతే ఇంటికి వెళ్లాలని సంకల్పం

5



'టవర్స్' నిర్మాణానికి స్థలాలు గుర్తించాలి

- క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణమే లక్ష్యం
- నెలాఖరులోగా డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల ఎంపిక పూర్తి
- రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి

హైదరాబాద్, అక్టోబర్ 23 , ఆశ్వి అప్డేట్స్:
పేదల ఉపాధికి ఎలాంటి ఆటంకం కలగకుండా వారు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మించి ఇవ్వాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని

మిగతా 3వ పేజీలో..



కరువును ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ

హైదరాబాద్, అక్టోబర్ 23, ఆశ్వి అప్డేట్స్:



ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే కరువును ముందుగానే అంచనా వేసి తాగు, సాగునీటి లభ్యతను కాపాడటంతోపాటు విద్యుత్ సరఫరా, వ్యవసాయం, గ్రామీణ ఉపాధి వంటి కీలక రంగాలకు రానున్న రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాఖల వారీగా సమగ్రంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ తీర్మానించింది. నియమిత గడువు ఈనెల 31లోగా కరువు మండలాలను ప్రకటించడంతోపాటు ఎల్‌నినో, కరువు పరిస్థితులను చర్చించడానికి అఖిలపక్ష సమావేశం త్వరలో ఏర్పాటు చేయాలని కమిటీ తీర్మానించింది. కరువు, ఎల్‌నినో పరిస్థితులను అధిగమించేందుకు, తగిన చర్యలను సమీక్షించి ప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకు ఉప ముఖ్యమంత్రి, సబ్‌కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం సచివాలయంలో శుక్రవారం జరిగింది. సమావేశానికి సబ్‌కమిటీ సభ్యులు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, సీఎస్ సంజయ్ జాజు, సంబంధిత శాఖల కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ కరవు ప్రభావిత మండలాలను శాస్త్రీయంగా విశ్లేషించి నిబంధనల ప్రకారం అర్హత కలిగిన మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. కరువు ప్రభావాన్ని తగ్గించి ప్రజలకు అవసరమైన సహాయసహకారాలు సమయానికి అందించడమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇప్పటికే కరువు తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలతోపాటు 20 శాతానికి మించి కరువు ప్రభావం ఉన్న మండలాల పరిస్థితులను కూడా పరిశీలించాలన్నారు. కరువు ప్రభావం వివిధ రంగాలపై ఎలా ఉండబోతోందో ముందుగానే అంచనా వేస్తే ప్రజలకు అవసరమైన సహాయాన్ని సకాలంలో అందించేందుకు వీలవుతుందని చెప్పారు. అందుకే ప్రతి శాఖ తన పరిధిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. తాగు, సాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు శాఖ సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజలకు అవసరమైన సేవలు నిరంతరాయంగా అందించేందుకు అన్ని శాఖలు తమ అవసరాలను ముందుగానే అంచనా వేయాలని, అత్యవసర ఖర్చుల కోసం ఆర్థిక శాఖ తగిన విధంగా సహకరించేలా ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. వ్యవసాయ రంగంపై కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు రానున్న పంటల సీజన్‌కు అనుగుణంగా నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు ముందస్తు సమాచారం అందించాలన్నారు. సమస్యలు తీవ్రరూపం దాల్చిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే వాటిని గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యమని పేర్కొన్నారు.





తుమ్మిడిహెట్టిపై త్వరలో చర్చలు

హైదరాబాద్, అక్టోబర్ 23, ఆశ్వి అప్డేట్స్ :

తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మాణంపై మహారాష్ట్ర ప్రభుత్వంతో త్వరలో జరిగే చర్చలకు సిద్ధంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ నెల 23 తర్వాత చర్చలకు ఆహ్వానిస్తానని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఇటీవలే సూచనప్రాయంగా తెలియజేశారని వెల్లడించారు. బోధి పెవిలియన్‌లో అధికారులతో ముఖ్యమంత్రి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. తుమ్మిడిహెట్టి బ్యారేజ్‌తోపాటు డిండి, అచ్చంపేట ఎత్తిపోతల ప్రాజెక్టులపై పీటముడిగా ఉన్న అంశాలన్నింటినీ ఈ సమావేశంలో చర్చించారు. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మిస్తే ఎంత నీటిని తెచ్చుకునే వీలుంది.. 150 మీటర్ల ఎత్తున ఎంత నీటిని ఎల్లంపల్లి వరకు తెచ్చుకునే వీలుందనే వివరాలను ఇరిగేషన్ ఇంజనీర్లు సీఎంకు వివరించారు. తుమ్మిడిహెట్టి నిర్మాణంతో మహారాష్ట్ర పరిధిలో ఎక్కడా గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం లేదని వివరించారు. 152 మీటర్ల ఎత్తున నిర్మిస్తే దాదాపు 2300 ఎకరాల భూములు ముంపునకు గురవుతాయని, 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే వెయ్యి ఎకరాల లోపే ముంపు ప్రభావం ఉంటుందని వివరించారు. మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని అంచనా వేసుకుని సాధ్యమైనంత నీటిని తెచ్చుకునేందుకు వీలుగా ఈ బ్యారేజీ నిర్మించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇప్పటికే కేంద్ర జల సంఘం అధ్వర్యంలో దిల్లీలో జరిగిన రెండు రాష్ట్రాల అధికారుల సమావేశం వివరాలన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని, సీడబ్ల్యుసీ కోరిన సమాచారాన్ని అందజేయాలని కూడా ఆదేశించారు. అటవీ, గిరిజన ప్రాంతం, అత్యంత వెనుకబడిన ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు తుమ్మిడిహెట్టి బ్యారేజ్ నిర్మిస్తున్నామని వివరించారు. అదే లక్ష్యాన్ని సాధించే సంకల్పంతో మహారాష్ట్ర ప్రభుత్వంతో సానుకూల చర్చలు, సంప్రదింపులు జరగాలని ముఖ్యమంత్రి తన ఆకాంక్షను వ్యక్తం చేశారు. జల్ జంగిల్ జమీన్ నినాదంతో ఏళ్లకేళ్లు పోరాడిన అటవీ ప్రాంతవాసులందరికీ ఈ ప్రాజెక్టు ద్వారా మేలు జరగాలన్నారు. అందుకే తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును వేగవంతం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన తర్వాత తుమ్మిడిహెట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటిని తెచ్చే ప్రాజెక్టు రూట్ డిజైన్లు, భూసేకరణపై దృష్టి సారించాలని ఇరిగేషన్ ఇంజనీర్లను సీఎం ఆదేశించారు. గతంలోనే 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిందని, అంత తక్కువ ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఆశించినంత నీటిని తెచ్చుకునేందుకు వీలు కాదని సీఎం అన్నారు. అందుకే 152 మీటర్ల ఎత్తున బ్యారేజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు అవసరమైన సాంకేతిక నివేదికలు, నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం, ఇతర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచాలన్నారు. మహారాష్ట్రతో చర్చల సందర్భంగా తెలంగాణ నీటి అవసరాలను తెలియజేసి, మన వాదనను సమర్థంగా వినిపించాలని మంత్రులకు సీఎం సూచించారు.

ఏడుల నుంచే డిండి, అచ్చంపేటకు నీరు

డిండి ప్రాజెక్టుకు ఏడుల రిజర్వాయర్ నుంచి 0.5 టీఎంసీల నీరు, అచ్చంపేట ఎత్తిపోతల పథకానికి 0.1 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ రెండు ప్రాజెక్టులకు అవసరమయ్యే 0.6 టీఎంసీల నీటిని శ్రీశైలం నుంచి అదనంగా సమకూర్చుకునే ఏర్పాట్లు చేయాలన్నారు. శ్రీశైలం, నార్లాపూర్ నుంచి ఏడుల రిజర్వాయర్ వరకు ఈ అదనపు నీటిని లిఫ్ట్ చేసుకునేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎక్కడెక్కడ పంపులు, పంప్ హౌస్‌లు అమర్చాలి.. ఇప్పుడున్న కెనాల్స్, టన్నెల్ సిస్టమ్ సామర్థ్యం సరిపోతుందా లేదా, ఎక్కడ కాల్వల సామర్థ్యం పెంచుకోవాలనేది ఇరిగేషన్ విభాగం వెంటనే అధ్యయనం చేసి అందుకు వీలైన డిజైన్లు తయారు చేసుకోవాలని సీఎం ఆదేశించారు. దీంతో పాలమూరు ప్రాజెక్టు నీటి అవసరాలకు ఎలాంటి కోత పడదని సీఎం స్పష్టం చేశారు. పాలమూరు నీటి కేటాయింపులకు ఆటంకం లేకుండా ఏడుల నుంచి డిండి, అచ్చంపేట ప్రాజెక్టులకు నీటిని అందించేలా ఈ పనులు చేపట్టాలని ఆదేశించారు. నార్లాపూర్ నుంచి డిండికి నీటిని తీసుకోవాలా... ఏడుల నుంచి డిండికి నీటిని తీసుకోవాలా అనే విషయంలో మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల ప్రతినిధుల అభ్యంతరాలు, విజ్ఞప్తులపై సమావేశంలో చర్చ జరిగింది. ఈ సందర్భంగా నార్లాపూర్ నుంచి నీటిని తరలిస్తే ఎంత ఖర్చవుతుంది, ఏడుల నుంచి నీటిని తీసుకుంటే ఎంత అంచనా వ్యయమవుతుందనే వివరాలన్నీ అధికారులు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనుకూలతలు, ప్రతికూలతలన్నింటినీ వివరించారు. మధ్యేమార్గంగా పాలమూరు ప్రాజెక్టు నీటికి ఢోకా లేకుండా డిండి, అచ్చంపేట ఎత్తిపోతలకు నీటిని లిఫ్ట్ చేసేందుకు వీలుగా అదనపు నీటిని తెచ్చుకునే పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి చేసిన సూచనకు మంత్రులు మద్దతు తెలిపారు. సమావేశంలో ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్, సీఎంవో సెక్రటరీ మాణిక్ రాజ్‌తోపాటు సెక్రటరీ(టన్నెల్) కల్నల్ పరీక్షిత్ మెహ్రా తోపాటు ఇరిగేషన్ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, అన్ని ప్రాజెక్టుల సీఈలు పాల్గొన్నారు.

కరువుపై జిల్లాలవారీగా కార్యాచరణ

మొదటిపేజీ తరువాయి

నిధులను అందుబాటులో ఉంచడంతోపాటు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలన్నారు. తాగునీటి సరఫరా, సాగునీటి అవసరాలు, పంటల రక్షణ, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలకు సకాలంలో ఉపశమనం కలిగించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. కరువు, ఎల్‌నినో పరిస్థితులను సమీక్షించి నివారణ చర్యలను సిఫారసు చేసేందుకు ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం సచివాలయంలో శుక్రవారం జరిగింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి సకాలంలో నివారణ చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ప్రతి జిల్లాలో సమస్యాత్మక ప్రాంతాలు, తలెత్తే నీటి కొరత, వ్యవసాయ అవసరాలను అంచనా వేసి, వాటిని ఎదుర్కొనేందుకు స్పష్టమైన ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు నిరంతర సమన్వయంతో పని చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కలెక్టర్లు తక్షణమే స్పందించేందుకు అవసరమైన నిధులు వారి వద్ద అందుబాటులో ఉండాలని సూచించారు. విధానపరమైన అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఉండాలన్నారు. తాగునీటి సరఫరా, సాగునీటి అవసరాలు, పంటల రక్షణ, సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రజలకు సకాలంలో ఉపశమనం కలిగించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. కరువు, ఎల్‌నినో పరిస్థితులను సమీక్షించి నివారణ చర్యలను సిఫారసు చేసేందుకు ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం సచివాలయంలో శుక్రవారం జరిగింది. సమావేశానికి సబ్‌కమిటీ సభ్యులు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, సీఎస్ సంజయ్ జాజు, సంబంధిత శాఖల కార్యదర్శులు హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ కరవు ప్రభావిత మండలాలను శాస్త్రీయంగా విశ్లేషించి నిబంధనల ప్రకారం అర్హత కలిగిన మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. కరువు ప్రభావాన్ని తగ్గించి ప్రజలకు అవసరమైన సహాయసహకారాలు సమయానికి అందించడమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇప్పటికే కరువు తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలతోపాటు 20 శాతానికి మించి మండలాలు, వ్యవసాయ పరిస్థితులు, ఆయా శాఖల సన్నద్ధతను సమావేశంలో సమీక్షించారు. జిల్లాల స్థాయిలో తాగునీటి లభ్యత, సాగునీటి అవసరాలను సమన్వయంతో పర్యవేక్షించాల్సిన అవసరంపై చర్చించారు.రాష్ట్రంలోని 358 మండలాల్లో కరువు సంబంధిత సమస్యలు ఉన్నట్లు సమావేశానికి వివరించారు. వీటిలో 315 మండలాల్లో నిర్దేశిత కరువు అంచనా ప్రమాణాలకు సరిపడే పరిస్థితులు ఉన్నాయని, మరో 43 మండలాల్లో పంట నష్టం ముప్పు ఉందని తెలిపారు. ఈ అదనపు మండలాల్లో పరిస్థితులను కూడా పరిశీలించి ఆధారాలతో కూడిన వివరాలను కేంద్రానికి సమర్పించే వినతిపత్రంలో పొందుపరచడంపై చర్చించారు. వర్తించే పథకాల కింద కేంద్ర సహాయం కోరేందుకు అవసరమైన సమాచారాన్ని సమగ్రంగా సిద్ధం చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. మొత్తంగా సుమారు 24 శాతం వర్షపాతం లోటు నమోదైనట్లు సమావేశంలో సమర్పించిన అంచనాలు వెల్లడించాయి. సాగునీటి జలాశయాల్లో నిల్వలు సాధారణ స్థాయి కంటే గణనీయంగా తక్కువగా ఉన్నాయని, పలు మండలాల్లో భూగర్భ జలాలపై ఒత్తిడి నెలకొన్నట్లు వివరించారు. వ్యవసాయం, తాగునీటి సరఫరా, గ్రామీణ జీవనోపాధులపై కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు సమగ్ర ప్రణాళికలు, నిరంతర పర్యవేక్షణ, సకాలంలో వనరుల సమీకరణపై సమావేశం దృష్టి సారించింది. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతోపాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

పొలాల్లో కన్నీటి ధార

మొదటిపేజీ తరువాయి

పాతాళానికి పడిపోవడంతో.. చివరకు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేసి పొలాలకు పారిస్తున్నారు. ఎల్‌నినో వల్ల భవిష్యత్తులో విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు తప్పవని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటిస్తూ వస్తోంది. వరి పంటలను సాగు చేయద్దని, నీటి వినియోగం తక్కువగా ఉంటే ఆరుతడి పంటలే వేయాలని జిల్లా అధికార యంత్రాంగం ప్రకటిస్తోందే తప్ప క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగా హన్మకొండ జిల్లా హసన్‌పర్తి మండలం అనంతసాగర్‌లో రైతు శ్యాంసుందర్ రెడ్డి తన ఎనిమిది ఎకరాల వరి పంటకు 4 ట్యాంకర్ల ద్వారా నీటిని పారించాడు. ఈ దృశ్యాలు చూసిన మిగతా రైతులు భవిష్యత్‌పై ఆందోళన చెందుతున్నారు. ముందుముందు తాగు, సాగునీటికి మరింత ముప్పు పొంచివున్న నేపథ్యంలో ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతులకు భరోసా కల్పించాలని, ప్రత్యామ్నాయ సాగుపై సమగ్రమైన ప్రణాళికను అమలు చేయాలని అన్నదాతలు డిమాండ్ చేస్తున్నారు.

కరువుతో జాగ్రత్త!

మొదటిపేజీ తరువాయి



ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సహా ప్రపంచవ్యాప్తంగా దాదాపు వంద దేశాలు ఈ ఎల్‌నినో ప్రభావంతో కరువును ఎదుర్కొంటున్నాయని వివరించారు.ప్రజా భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, డీసీసీ అధ్యక్షులు, ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు తదితరులు హాజరుకాగా ఎల్‌నినో, ఎమ్మెల్సీ ఎన్నికలపై సీఎం దిశానిర్దేశం చేశారు. కరవు ప్రారంభమైనప్పుడు మొదట మనకు దాని ప్రభావం తెలియదు.. నెమ్మదినెమ్మదిగా కబళిస్తుంది.. ఆరు నెలల నుంచి ప్రజలను అప్రమత్తులను చేస్తున్నాం అని చెప్పారు.అక్టోబర్ నుండి జూలై వరకు ఎండ వేడి విపరీతంగా పెరిగి నీటి ఆవిరి ఎక్కువవుతుంది, ఫలితంగా నీటి అందుబాటు తగ్గుతుందని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఉష్ణోగ్రతలు పెరిగి నీటి కొరత వల్ల విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతుందని హెచ్చరించారు. సాధారణంగా ఈ సీజన్‌లో 13 వేల మెగావాట్లకు మించని విద్యుత్ వినియోగం ప్రస్తుతం అనూహ్యంగా 20 శాతం పెరిగి 20వేల మెగావాట్లకు చేరుకుందని తెలిపారు. అయినప్పటికీ అధికారులు, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క 24 గంటలు కష్టపడి విద్యుత్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారని కొనియాడారు.

ప్రాజెక్టులలో నీటి నిల్వలు నిల్ – తాగేందుకే ప్రాధాన్యం

రాష్ట్రంలో ప్రాజెక్టుల నీటి నిల్వలు 20 శాతం కూడా లేవని, మొత్తం 200 టీఎంసీలు కూడా లేక డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయని సీఎం పేర్కొన్నారు. 30 లక్షల పంప్‌సెట్లలో 15 లక్షలు ఎండిపోయాయని, సాగునీటి కంటే తాగునీటి సమస్యే తీవ్రంగా మారనుందని తెలిపారు. ఈ పరిస్థితిని దాచిపెడితే క్యాన్సర్‌లా మారుతుందని, అందువల్లే రాబోయే 8 నుండి 10 నెలలపాటు నిజాన్ని ప్రజలకు వివరించి సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. వ్యవసాయానికి పూర్తిస్థాయి నీరు ఇవ్వడం సాధ్యపడదని, అందువల్ల రైతులు వరి సాగుకు బదులు ఆరుతడి పంటలు, కూరగాయల సాగు మాత్రమే చేపట్టేలా రైతు వేదికల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో మూగజీవాల కోసం ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి పశుగ్రాసం, తాగునీరు అందించేందుకు ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

సబ్ కమిటీ ఏర్పాటు – ప్రత్యేకాధికారి నియామకం

కరువు పరిణామాలను పర్యవేక్షించేందుకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో సబ్ కమిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే ప్రతిపక్షాలు చేసే తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టి ప్రజల్లో సరైన అవగాహన కల్పించడానికి ప్రభుత్వ మాజీ కార్యదర్శి రామకృష్ణారావును ఎల్‌నినో ప్రత్యేక అధికారిగా నియమించినట్లు వెల్లడించారు. కరోనా సమయంలో బాధ్యతారాహిత్యంగా మాట్లాడి ప్రజలను కేసీఆర్ మోసం చేశారని, అలాంటి తప్పుడు మాటలు నమ్మవద్దని కోరారు. కరోనా సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హెచ్చరిస్తే వాళ్లకు మాస్కులు ఇవ్వాలని, క్రోసిన్ వేసుకోండంటూ సీఎం హోదాలో కేసీఆర్ అవహేళన చేశారన్నారు. ఆయన మాటలు నమ్మి మాస్కులు పెట్టుకోని వారు కనుమరుగయ్యారని, ఆయన మాటలు నమ్మని మనం ఈరోజు ఇక్కడ కూర్చున్నామని అన్నారు. సోనియా గాంధీ దూరదృష్టితో తెచ్చిన ఉపాధి హామీ నాడు ప్రజలకు ఉపాధి కల్పించిందన్నారు. గతంలో ఏడు రకాల సన్న వడ్లకు బోనస్ ఇస్తామంటే విమర్శలు చేశారని, కానీ రైతులు నమ్మి పండించడంతో ఈరోజు మార్కెట్‌లో రూ.3,400 నుండి రూ.4,000 వరకు మంచి ధర లభించిందని ఉదహరించారు.

'సర్'కు వ్యతిరేకంగా రాహుల్ పోరాటం – బిల్లీ సభకు పిలుపు

అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన పీపుల్స్ రిప్రజెంటేషన్ యాక్ట్‌కు భంగం కలిగిస్తూ బీజేపీ ప్రభుత్వం దురుద్దేశంతో 'సర్' ప్రక్రియను ఉపయోగిస్తోందని సీఎం మండిపడ్డారు. దీనిద్వారా పేదల హక్కులను కాలరాసి అధికారాన్ని శాశ్వతం చేసుకోవాలని మోదీ చూస్తున్నారని, దీనికి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ పోరాడుతున్నారని తెలిపారు. ఈ క్రమంలో నవంబర్ 1న దిల్లీలో రాహుల్ గాంధీ నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు రాష్ట్రం నుంచి పదివేల నుండి 15వేల మంది తరలివెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌కు ఎన్నికలు, ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం కొత్త కాదని, ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టి వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రజాప్రతినిధులకు మార్గదర్శనం చేశారు.

తాగునీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి

కేబినెట్ సబ్ కమిటీతోపాటు అన్ని స్థాయిల్లో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేసి తాగునీటిని అందించాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా టోల్ ఫ్రీ నంబర్ ఇవ్వాలని సూచించారు. పార్టీ కార్యకర్తలు, ఎనఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్ కూడా ఈ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలన్నారు. విద్యుత్‌ను ఎంత ఖర్చు పెట్టి అయినా కొనడానికి సిద్ధంగా ఉన్నా మార్కెట్‌లో అందుబాటులో లేదని తెలిపారు. అవసరం లేకుండా విద్యుత్ వాడొద్దని ప్రజలకు సూచించారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవాలన్నారు. కొండారెడ్డిపల్లిలో గ్రామస్తులు సోలార్ విద్యుత్‌ను అమ్మడం ద్వారా లబ్ధి పొందారని గుర్తు చేశారు. బీఆరఎస్ హయాంలో నాలుగు వేల మెగావాట్ల యాదాద్రి పవర్ ప్లాంట్‌కు రూ.8 వేల కోట్లు అదనంగా ఖర్చు అయిందని, యూనిట్ విద్యుత్ ఉత్పత్తి ఖర్చు రూ.6కు పైగా పెరిగిందని, సింగరేణిలో లభ్యం కాని జీ9 బొగ్గుతో యాదాద్రిలో విద్యుత్ ఉత్పత్తి చేస్తామని చెప్పారని, విదేశాల నుంచి కృష్ణపట్నం పోర్టు ద్వారా బొగ్గును దిగుమతి చేసుకుని యాదాద్రిలో విద్యుత్ ఉత్పత్తి చేయాలని చూశారని విమర్శించారు. రామగుండం, కొత్తగూడెం, మంచిర్యాల వంటి ప్రాంతాల్లో యాదాద్రిని నిర్మిస్తే రూ.28 వేల కోట్లతో 2019 నాటికి పూర్తి అయ్యేదని, ఏటా రూ.2 వేల కోట్ల బొగ్గు రవాణా భారం తగ్గేదని చెప్పారు. నైని ప్రాంతానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెళ్లి స్థానికులతో మాట్లాడి బొగ్గు తీసుకువస్తున్నామన్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో మాట్లాడి మహానది కోల్‌ఫీల్డ్స్ నుంచి కూడా యాదాద్రికి బొగ్గు తీసుకొస్తున్నామని, యాదాద్రిలో ఒక్కొక్క యూనిట్‌ను పట్టాలెక్కిస్తున్నామని చెప్పారు. నీళ్లు, నిధులు, నియామకాలు అన్నీ కేసీఆర్ కుటుంబానికే పోయాయని ఆరోపించారు. బీఆరఎస్ ఖాతాల్లో రూ.1,500 కోట్లు ఉన్నాయంటూ ఎన్ని ఏళ్లు అధికారంలో ఉన్నా కాంగ్రెస్ పార్టీ నిధుల కోసం ప్రతి నెలా వెతుక్కుంటోందన్నారు.సింగరేణిలో ఒక్క టెండర్ కూడా వేయకుండా బీఆరఎస్ ప్రభుత్వం అడ్డుకుందని తెలిపారు.

రైతులకు విద్యుత్ ఇవ్వడంలో అద్భుతమైన విజయం

విద్యుత్ విషయంలో ప్రభుత్వం బాగా పనిచేసిందని, రైతులకు విద్యుత్ ఇవ్వడంలో అద్భుతమైన విజయం సాధించామని రేవంత్‌రెడ్డి చెప్పారు. మోదీ ఎన్ని పేర్లు మార్చినా అది ఎప్పటికీ మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకమేనన్నారు. సంక్రాంతి తర్వాత మే వరకు నాలుగు నెల పాటు ప్రత్యేక పథకాన్ని తీసుకువస్తామని, కేంద్రం నుంచి వచ్చే నిధులతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా పెద్ద ఎత్తున ఈ పథకం కోసం ఖర్చు పెట్టబోతోందని తెలిపారు. ప్రతి ప్రజాప్రతినిధి గ్రామాలకు వెళ్లాల్సిందేనని, అందరి ఫోన్లలో ప్రత్యేక యాప్ పెట్టి పర్యవేక్షణ చేస్తామంటూ వ్యవసాయ పొలాలకు వెళ్లే దారులు, కాలువలు, చెరువులు, కుంటలను పునరుద్ధరించుకోవడానికి ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రైతులను ఉత్తేజపరచడానికి కళాజాతాలను సిద్ధం చేయాలన్నారు. గాంధీభవన్‌లో ఎంపీ చామల కిరణ్ నేతృత్వంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై అప్రమత్తంగా ఉండాలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై అందరూ అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు సీఎం పిలుపునిచ్చారు. పట్టభద్రుల ఎన్నికల్లో ప్రతిసారీ ఓటు హక్కును నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ నియోజకవర్గాల్లో గతంతో పోల్చితే ఇప్పటివరకు 36 శాతం ఓట్లు మాత్రమే నమోదయ్యాయి. ఇంకా 64 శాతం ఓట్లు నమోదు కావాలి. యువకులు సామా రామ్మోహన్ రెడ్డి, రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని పార్టీ ఎంపిక చేసింది. బెస్ట్ క్యాండిడేట్స్‌ను ఎంపిక చేసింది. అందరం కలిసి గెలిపించుకోవాలి అని పిలుపునిచ్చారు. బీఆరఎస్, బీజేపీ దొంగదెబ్బ తీయాలని ప్రయత్నిస్తున్నాయి. వెనుక అలాయ్ బలాయ్ చేసుకుంటున్నాయని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ ఎన్నికలు అభ్యర్థులకు మాత్రమే సంబంధించినవి కావు.. పార్టీకి కూడా సంబంధించినవి. గెలిపించి తీరాలి.. ఎన్నికలు లేని జిల్లాలకు చెందిన నాయకులకు బాధ్యతలు అప్పగించాలి అని సూచించారు.

నేరాల కట్టడికి ఉమ్మడి కార్యాచరణ

హైదరాబాద్, అక్టోబరు 23, ఆశ్వి అప్డేట్స్:

రాష్ట్రాల సరిహద్దులు దాటి విస్తరిస్తున్న నేరాలను అరికట్టేందుకు దక్షిణాది రాష్ట్రాల పోలీసులు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీసు వ్యవస్థలో సంస్కరణలు చేపట్టి, ఉమ్మడి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. నేరస్థుల సమాచారాన్ని పరస్పరం పంచుకునేందుకు ప్రత్యేక సెక్రటేరియట్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీసు కమిషనరేట్లతో పాటు హైడ్రా, ఈగల్, టీజీ సేఫ్, టీజీ మార్స్ వంటి ప్రత్యేక విభాగాల ద్వారా తెలంగాణలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. పోలీసు వ్యవస్థపై చేసే వ్యయం ప్రజల భద్రత, భవిష్యత్తుపై పెట్టుబడిగా భావించాలని సీఎం పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయే పోలీసుల కుటుంబాలకు రూ.కోటి నుంచి రూ.2 కోట్ల వరకు పరిహారం, ఇంటి స్థలాలు, కారుణ్య నియామకాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకునేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందన్నారు.

రాష్ట్రాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి రాష్ట్రం నోడల్ అధికారులను నియమించుకోవాలని డీజీపీ సీవీ ఆనంద్ సూచించారు. ప్రత్యేక సెక్రటేరియట్‌తో పాటు క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహిస్తే నేరాల నియంత్రణలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. తెలంగాణలో 824 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు తెలిపారు. గ్రేహౌండ్స్, ఎస్ఐబీ, ఆక్టోపస్ విభాగాల సిబ్బందిని అవసరాలకు అనుగుణంగా పునర్వినియోగిస్తున్నట్లు వివరించారు.

2023లో ఏర్పాటు చేసిన ఈగల్ ఫోర్స్ సిబ్బందికి 30 శాతం అదనపు వేతనం అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. సైబర్ నేరాల బాధితులకు రూ.69.4 కోట్లను తిరిగి ఇప్పించినట్లు వెల్లడించారు. సుమారు రూ.600 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా లక్షకు పైగా సీసీటీవీ కెమెరాలను అనుసంధానించి పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన ఆపరేషన్ చైతన్యం, ఆపరేషన్ ట్రేస్ ద్వారా 2025 ఆగస్టు నుంచి 2026 ఆగస్టు వరకు 11,242 మంది అదృశ్యమైన మహిళలు, చిన్నారుల ఆచూకీ గుర్తించినట్లు ఐజీ రవికృష్ణ తెలిపారు. తమిళనాడులో పోలీసుల మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక కార్యక్రమాలు, కేరళలో విద్యార్థి పోలీసు శిక్షణ, కమ్యూనిటీ పోలీసింగ్ విధానాలను ఆయా రాష్ట్రాల అధికారులు వివరించారు. ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలు, మానవ అక్రమ రవాణా నియంత్రణతో పాటు పోలీసింగ్‌లో కృత్రిమ మేధ వినియోగంపై సమావేశంలో చర్చించారు. తెలంగాణలో సీసీటీవీ పర్యవేక్షణ, ఏఐ ఆధారిత కాలింగ్ వ్యవస్థ, డయల్ 112 సేవలను ఇతర రాష్ట్రాల అధికారులు పరిశీలించారు. దక్షిణాది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పోలీసు ఉన్నతాధికారులతో పాటు సీబీఐ, ఎన్ఐఏ, ఐబీ, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌జీ తదితర కేంద్ర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి డీజీ మహేష్ భగవత్ కార్యదర్శిగా వ్యవహరించారు

భద్రతే అభివృద్ధికి పునాది

- **తెలంగాణ ప్రగతికి టీజీఎస్‌పీఎఫ్ రక్షణ కవచం**
- **67 ప్రభుత్వ కీలక సంస్థలకు టీజీఎస్‌పీఎఫ్ భద్రత**
- **టీజీఎస్‌పీఎఫ్ సిబ్బంది సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం**
- **ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

హైదరాబాద్, అక్టోబర్ 23, ఆశ్వి అప్డేట్స్ :

భద్రతే అభివృద్ధికి పునాది అని, రాష్ట్రంలోని కీలక సంస్థలకు రక్షణ కల్పిస్తున్న తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం (టీజీఎస్‌పీఎఫ్) సేవలు రాష్ట్ర ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. దళం సిబ్బంది సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధి, శిక్షణ అవకాశాలు, పని పరిస్థితుల మెరుగుదలకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం 36వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అడిషనల్ డీజీ స్వాతి లక్రా, సీనియర్ ఐపీఎస్ అధికారులు ఘన స్వాగతం పలికారు. తొలుత ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించగా వందేమాతరం గీతంతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ 1991 అక్టోబర్ 23న ఏర్పాటైన ఈ దళం 36 ఏళ్లలో విశిష్ట సంస్థగా ఎదిగిందన్నారు. ప్రస్తుతం తెలంగాణ సచివాలయం, శాసనసభ, హైకోర్టు, నాగార్జునసాగర్ ప్రాజెక్టు, ప్రధాన దేవాలయాలు, ప్రభుత్వ హాస్పిటల్స్, విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు, కేంద్ర ప్రభుత్వానికి చెందిన కీలక సంస్థలు సహా మొత్తం 67 ముఖ్యమైన సంస్థలకు భద్రత కల్పిస్తోందని పేర్కొన్నారు. దాదాపు రెండు వేల మంది సిబ్బంది ఈ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తున్నారని చెప్పారు. దళం నినాదమైన ప్రగతికి రక్షణ ఎంతో అర్థవంతమైనదని అన్నారు. పరిశ్రమలు, పెట్టుబడులు, రహదారులు, విద్యుత్ ప్రాజెక్టులు, హాస్పిటల్స్, విద్యాసంస్థల అభివృద్ధికి పటిష్టమైన భద్రత అవసరమని స్పష్టం చేశారు. భద్రత అనేది అభివృద్ధి తర్వాత వచ్చే అంశం కాదని, అభివృద్ధికి ముందస్తు పునాది అని పేర్కొన్నారు. పెట్టుబడిదారులు పరిశ్రమలు స్థాపించాలన్నా, వైద్యులు రోగులకు సేవలు అందించాలన్నా, రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కావాలన్నా విశ్వసనీయమైన మౌలిక సదుపాయాలతోపాటు వాటికి పటిష్టమైన రక్షణ ఉండాలని చెప్పారు.

విద్యుత్ కేంద్రాలకు కీలక రక్షణ

విద్యుత్ శాఖ బాధ్యతలు చూస్తున్న మంత్రిగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల వద్ద ప్రత్యేక రక్షణ దళం సేవల ప్రాధాన్యం తనకు మరింత స్పష్టంగా తెలుసని ఉప ముఖ్యమంత్రి అన్నారు. యాదాద్రి, కొత్తగూడెం, భద్రాద్రి వంటి విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఎంతో కీలకమని తెలిపారు. అక్కడ ఇంజినీర్లు, కార్మికులు విద్యుత్ ఉత్పత్తి బాధ్యతలు నిర్వర్తిస్తుంటే ఆ కేంద్రాలకు భద్రత కల్పిస్తూ ఉత్పత్తి నిరంతరాయంగా సాగేలా టీజీఎస్‌పీఎఫ్ సిబ్బంది తోడ్పడుతున్నారని ప్రశంసించారు. విద్యుత్ వెలుగులు అందరికీ కనిపించినా వాటిని కాపాడే భద్రతా సిబ్బంది కృషి చాలాసార్లు కనిపించదని, అయితే వారి సేవల విలువ ఎంతో గొప్పదని అన్నారు. ఆధునిక నిఘా వ్యవస్థలు, డ్రోన్లు, కృత్రిమ మేధ, సైబర్ వ్యవస్థలతో అనుసంధానమైన భౌతిక మౌలిక సదుపాయాలు కొత్త సవాళ్లను తీసుకొస్తున్నాయని చెప్పారు. భవిష్యత్తులో శారీరక దృఢత్వంతోపాటు సాంకేతిక పరిజ్ఞానం, అప్రమత్తత, వేగంగా స్పందించే సామర్థ్యం కూడా భద్రతా సిబ్బందికి అత్యంత అవసరమని వివరించారు. అమీన్‌పూర్‌లో ప్రత్యేక శిక్షణ అకాడమీ ఉండటం సంతోషకరమని పేర్కొంటూ శిక్షణ అనేది ఉద్యోగంలో చేరినప్పుడు పూర్తయ్యే ప్రక్రియ కాదని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా నిరంతరం నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు.

క్రమశిక్షణ, నిజాయతీనే సంస్థకు బలం

భద్రతా వ్యవస్థ బలాన్ని ఆయుధాలతోనే కొలవలేమని, వాటిని ధరించే సిబ్బంది క్రమశిక్షణ, నిజాయతీ, వివేకం, బాధ్యతాయుత ప్రవర్తనతోనే అంచనా వేయాలని ఉప ముఖ్యమంత్రి అన్నారు. విధులకు అప్పగించిన అధికారాలను బాధ్యతగా వినియోగించడం, ప్రజలతో మర్యాదగా వ్యవహరించడం, అత్యవసర పరిస్థితుల్లో సమయస్ఫూర్తితో స్పందించడం సంస్థ ప్రతిష్ఠను నిర్ణయిస్తాయని చెప్పారు. పండుగలు, సెలవు దినాలు, రాత్రివేళలు, అత్యవసర సమయాల్లోనూ భద్రతా సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారని గుర్తు చేశారు. సిబ్బంది బాధ్యతలను అర్థం చేసుకుంటూ వారికి మానసిక బలాన్ని అందిస్తున్న కుటుంబ సభ్యుల త్యాగాలు కూడా ప్రశంసనీయమని అన్నారు. దళం అధికారులు, సిబ్బందితోపాటు వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం తరపున ప్రత్యేక అభినందనలు తెలిపారు. 'మీరు కాపాడేది కేవలం భవనాలను కాదు.. ప్రజల విశ్వాసాన్ని. మీరు రక్షించేది కేవలం సంస్థలను కాదు.. తెలంగాణ ప్రగతిని' అని భట్టి విక్రమార్క పేర్కొంటూ దళం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

కాంగ్రెస్ ది అసమర్థ పాలన

హైదరాబాద్, అక్టోబర్ 23, ఆశ్వి అప్డేట్స్:

అసమర్థుడికి అధికారం అప్పగిస్తే ఇల్లు పీకి పందిరి వేసినట్టుగా ఉంది రేవంత్ పాలన!కరువు రాగానే చేతులెత్తేసిన చేతగాని సీఎంగా రేవంత్ చరిత్రలో మిగిలిపోతాడని మాజీ మంత్రి బిఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు అన్నారు. రేవంత్ వ్యాఖ్యలపై స్పందిస్తూ ఆయన రంకెలు వేసినంత మాత్రాన నిజం అబద్ధం అయిపోదు రేవంత్ రెడ్డి.ఇది ప్రకృతి తెచ్చిన కరువు కాదు.. ముమ్మాటికీ కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరువే. మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేతులు కాలాక ఆకులు పట్టుకోవడమేనన్నారు. రైతులకు, ప్రజలకు భరోసా ఇవ్వడం మానేసి భయభ్రాంతులకు గురిచేస్తావా రేవంత్ రెడ్డి? కరువు వస్తోంది.. నేనేం చేయలేనని చేతులెత్తేసేవాడా పాలకుడు? తాగునీళ్లు కూడా ఉండవని భయపెట్టడానికేనా రేవంత్‌కు సీఎం పదవి ఉన్నది? ప్రజలను కాపాడేందుకు ఎంతకైనా సిద్ధమనవాడే నిజమైన పాలకుడు? ఇప్పుడు కేసీఆర్ సీఎంగా ఉంటే రేవంత్‌లాగా పనికిమాలిన, చేతగాని మాటలు చెప్పేవారా? వచ్చిన నీటిని వచ్చినట్టుగా ఒడిసిపట్టి తెలంగాణకు కరువు రాకుండా చూసేవారు. ముందస్తు చర్యలు తీసుకొని కరెంటు కోతలు నివారించేవారు.ఎల్‌నినో గురించి ఆరు నెలలుగా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని చెబుతున్న మీరు ఈ ఆరు నెలల్లో కరువు నివారణకు తీసుకున్న ముందస్తు చర్యలేంటో చెప్పగలరా అని ప్రశ్నించారు. కరువు ప్రకృతి సృష్టి కావచ్చు.. కానీ కరువును ఎదుర్కొనే ప్రణాళిక రూపొందించడం, ప్రజలకు భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యత కాదా? నీటి నిల్వలు, విద్యుత్, ప్రత్యామ్నాయ పంటలు, పశుగ్రాసం, ఉపాధి అంశాలపై మీ కార్యాచరణ ఏంటి? కరువు వస్తుందని ఆరు నెలలుగా తెలుసని చెబుతున్నారు.. మరి గోదావరి, కృష్ణా నదుల నుంచి నీళ్లను ఎందుకు ఎత్తిపోలేదు? ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు ఎందుకు పెంచుకోలేదు?బొగ్గు నిల్వలు లేవు, కరెంట్ సంక్షోభం వస్తుందని మేం మొత్తుకుంటుంటే.. ఎందుకు ఫిడేలు వాయిస్తూ కూర్చున్నారు?ఈరోజు రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులకు మీ చేతగానితనం కారణం కాదా? ఎందుకు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు?ఎల్‌నినో ప్రపంచవ్యాప్త సమస్య అయితే.. పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు కరువు లేదు? అక్కడ ఎందుకు నీటి గలగలలు.. ఇక్కడ ఎందుకు రిజర్వాయర్లు వెలవెలబోతున్నాయి?కరువు పేరుతో వ్యవసాయానికి నీళ్లు ఇవ్వలేమని ముందే చేతులెత్తేయడమే పాలనా దక్షత కాదు.. రైతులను సంక్షోభంలోకి నెట్టడమే!20 వేల మెగావాట్ల విద్యుత్ వినియోగాన్ని గొప్పగా చెబుతున్నారు.. అదే సమయంలో విద్యుత్ కోతలతో ఎండుతున్న పంటల గురించి ఎందుకు మాట్లాడటం లేదు? ట్యాంకర్లతో నీళ్లు పోసుకుంటున్న రైతుల గోస కనిపించడం లేదా?బియ్యం ధరలు అడ్డగోలుగా పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతుంటే.. దాన్ని కూడా తన ఘనతగా చెప్పుకునే భావదారిద్ర్యం రేవంత్ రెడ్డిది.ఇలాంటి వ్యక్తి కరువు నుండి ప్రజలను కాపాడతారా ప్రజలు ఆలోచించాలి.ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే వ్యక్తిగత దూషణలు.. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపితే రాజకీయ విమర్శలు.. ఇదేనా మీ ప్రజాపాలన?కరోనా సమయంలో కేసీఆర్ తీసుకున్న చర్యలపై మాట్లాడే ముందు.. దాన్ని కూడా తప్పుగా చూపించేందుకు రేవంత్ దగుల్బాజీ మాటలు మాట్లాడుతున్నారు.కేసీఆర్‌పై విమర్శలు చేయడానికి చూపిస్తున్న శ్రద్ధలో పావు వంతైనా రైతులకు, ప్రజలకు నీళ్లు అందించడంపై చూపించండి. రాజకీయాల కోసం పుట్టిన గడ్డనే కరువు రక్కసికి బలిపెట్టిన ప్రజావ్యతిరేకి, రైతు వ్యతిరేకి రేవంత్ కాదా?నన్ను, కేసీఆర్ ని తిట్టినంత మాత్రాన, నా పొడుగు గురించి మాట్లాడినంత మాత్రాన ప్రాజెక్టుల్లో నీళ్లు పెరగవు. కరెంట్ సమస్య తీరదు. రాష్ట్రంలోని ప్రాజెక్టుల వారీగా నీటి నిల్వలు, తాగునీటి అవసరాలు, సాగునీటి పరిస్థితి, కరువు నివారణకు కేటాయించిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయండి. ప్రచార ఆర్భాటాలు పక్కన బెట్టి, కరువును ఎదుర్కొనే సమగ్ర కార్యాచరణను ప్రకటించండి. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు, పశువులకు గ్రాసం, కూలీలకు ఉపాధి కల్పించండి. నష్టపోయిన రైతులకు పరిహారం అందించండి. రైతులకు, పంటలకు బీమా పథకాలను తక్షణ అమలు చేయండి. ప్రకృతి వైపరీత్యాన్ని రాజకీయాలకు వాడుకోవడం కాదు..ప్రజలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యత అన్న విషయాన్ని ఇకనైనా గుర్తించండని హితవు పలికారు.

ఇండ్ల కేటాయింపులో గుడిసెవాసులకే ప్రాధాన్యం

హుస్నాబాద్, అక్టోబర్ 23, ఆశ్వి అప్డేట్స్:

ఇళ్లు లేని నిరుపేదలకు, గుడిసెల్లో జీవనం సాగిస్తున్న కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల కోసం అర్హుల నుంచి భారీగా డిమాండ్ ఉన్న నేపథ్యంలో, అత్యంత దయనీయ పరిస్థితుల్లో నివసిస్తున్న పేదలకు ముందుగా సొంతింటి కల నెరవేర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ప్రాధాన్యతా క్రమాన్ని నిర్ణయించిందని ఆయన తెలిపారు. వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, విస్తరణ పనుల్లో ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు సైతం నిబంధనల ప్రకారం ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గౌరవెల్లిగండిపల్లి ప్రాజెక్టు నిర్మాణం కారణంగా ఇళ్లు కోల్పోయి, ఇప్పటివరకు ఎలాంటి నివాసం పొందని వారిలో స్థలం ఉండి అర్హత కలిగిన ప్రతి నిర్వాసిత కుటుంబానికి ఇల్లు మంజూరు చేస్తామన్నారు. కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ నాలుగు వరుసల రహదారి విస్తరణలో చిగురుమామిడి, సుందరగిరి ప్రాంతాల్లో ఇళ్లు కోల్పోయిన వారికి, అలాగే హుస్నాబాద్ పట్టణంలోని మల్లెచెట్టు చౌరస్తా నుంచి జనగామ మార్గంలో (అక్కన్నపేట మీదుగా) ఇళ్లు కోల్పోయిన అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.హుస్నాబాద్ చౌటపల్లి వద్ద ఇండస్ట్రియల్ పార్క్ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన వారిలో అర్హత ఉండి, ఇల్లు లేని కుటుంబాలకు కూడా ఇళ్లు కేటాయిస్తామన్నారు. నియోజకవర్గంలో అర్హుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, నిజమైన పేదలు, నివాసాలు కోల్పోయిన అత్యంత ఆవశ్యకత ఉన్న కుటుంబాలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి పొన్నం స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా శ్రమిస్తానని పునరుద్ఘాటించారు.

'టవర్స్' నిర్మాణానికి
స్థలాలు గుర్తించాలి

మొదటిపేజీ తరువాయి

రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఒకవైపు ప్రభుత్వ భూములను పరిరక్షిస్తూనే మరోవైపు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి అవసరమైన భూములను యుద్ధప్రాతిపదికన గుర్తించాలని అధికారులను ఆదేశించారు. క్యూర్ పరిధిలోని నియోజకవర్గాల వారీగా మొదటి విడత నిర్మాణాలకు అవసరమైన స్థలాల గుర్తింపును పూర్తిచేయడంతోపాటు, రెండో, మూడో విడతల్లో చేపట్టనున్న నిర్మాణాలకు కూడా ముందుగానే భూములను సిద్ధం చేయాలని కలెక్టర్లకు సూచించారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల కలెక్టర్లు, ఆర్డీవోలు, హౌసింగ్ శాఖ అధికారులతో మంత్రి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణం, రెండో, మూడో విడతలకు అవసరమైన భూముల గుర్తింపు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యం

క్యూర్ పరిధిలోని పేదలు నివసిస్తున్న ప్రాంతాలకు సమీపంలోనే ఇళ్లు నిర్మించి అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని మంత్రి పొంగులేటి తెలిపారు. నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. పేదవాడికి సొంత ఇంటిని అందించడం కంటే తమ ప్రభుత్వానికి మరే అంశమూ ప్రాధాన్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. భూముల గుర్తింపు నుంచి నిర్మాణాల ప్రారంభం వరకు ప్రతి దశలోనూ నిర్దిష్ట కార్యాచరణతో ముందుకు సాగాలని, స్థలాల ఎంపికలో ప్రభుత్వ భూముల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు.

క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణమే లక్ష్యం

క్యూర్ పరిధిలో మొత్తం లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. మొదటి విడతలో ప్రతి నియోజకవర్గంలో సుమారు 500 ఇళ్ల చొప్పున నిర్మాణాలు చేపడుతున్నామని వెల్లడించారు. మొదటి విడతకు సంబంధించి రెండు, మూడు నియోజకవర్గాలకు అవసరమైన స్థలాల గుర్తింపును వేగవంతం చేయాలని, మిగిలిన నియోజకవర్గాల్లో రెండో, మూడో విడతల నిర్మాణాలకు అవసరమైన భూములను కూడా ముందుగానే గుర్తించి సిద్ధంగా ఉంచాలని కలెక్టర్లను ఆదేశించారు. భూముల లభ్యత, స్థలాల అనుకూలత, ఇతర అవసరమైన అంశాలపై అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఎంపికలో పారదర్శకతకు పెద్దపీట

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. హౌసింగ్ కార్పొరేషన్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి లబ్ధిదారుల ఎంపికకు డ్రా నిర్వహించాలని సూచించారు. లబ్ధిదారుల వివరాలన్నింటినీ సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసి ఆన్‌లైన్ విధానంలో డ్రా నిర్వహించడం ద్వారా ఎంపిక ప్రక్రియలో పారదర్శకతను మరింత పెంచవచ్చని, డ్రా ప్రక్రియను ప్రత్యక్ష ప్రసారం చేసేలా ఏర్పాట్లు చేయాలని, ప్రత్యక్షంగా వీక్షించలేని వారు కూడా డ్రాకు సంబంధించిన వివరాలను యూట్యూబ్‌లో తమ వివరాలు ఎంపిక జాబితాలో ఉన్నాయో లేదో ఎప్పుడైనా పరిశీలించుకునే అవకాశం ఉంటుందని వివరించారు. సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, హౌసింగ్ శాఖ కార్యదర్శి వి.పి.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

'ఖేలో ఇండియా' నిర్వహణకు
పక్కా కార్యాచరణ

హైదరాబాద్, అక్టోబర్ 23 , ఆశ్వి అప్డేట్స్:

రాష్ట్రంలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు ఖేలో ఇండియా గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగుతోందని యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఖేలో ఇండియా పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, క్రీడాకారుల ఎంపిక, స్టేడియాల సిద్ధత, శిక్షణ తదితర అంశాలపై సచివాలయంలో ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఖేలో ఇండియా గేమ్స్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా వచ్చే క్రీడాకారులు, కోచ్‌లు, ప్రతినిధులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

గ్రామీణ స్థాయి నుంచే క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం

రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి జాతీయ స్థాయిలో రాణించేలా క్రీడాకారులను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. 27 రకాల క్రీడాంశాల్లో 1:4, 1:2, 1:1 నిష్పత్తుల ఆధారంగా క్రీడాకారులను దశలవారీగా గుర్తించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని ఖేలో ఇండియా పోటీలకు సిద్ధం చేయాలని సూచించారు. క్రీడాకారుల ఎంపికలో పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతిభ ఆధారంగానే అవకాశాలు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కేవలం పోటీల నిర్వహణకే పరిమితం కాకుండా రాష్ట్ర క్రీడాకారులు జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు సాగాలని తెలిపారు.

స్టేడియాల సిద్ధత.. క్రీడాకారులకు పోషకాహారం

ఖేలో ఇండియా పోటీలు నిర్వహించే క్రీడా వేదికలు, స్టేడియాలను గుర్తించి వాటిలో అవసరమైన మౌలిక సదుపాయాలు, క్రీడా పరికరాలు, ఇతర ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని మంత్రి శ్రీహరి ఆదేశించారు. పోటీల నిర్వహణకు సంబంధించి ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారించి అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించారు. క్రీడాకారుల శారీరక దృఢత్వం, సామర్థ్యం పెంపొందించేందుకు నాణ్యమైన శిక్షణతో పాటు పోషకాలు సమృద్ధిగా ఉండే ఆహారాన్ని ప్రభుత్వ పరంగా అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన శిక్షణ, వైద్య సహాయం, వసతి, రవాణా వంటి సదుపాయాల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

దేశానికే ఆదర్శంగా నిర్వహణ

ఖేలో ఇండియా గేమ్స్ దేశానికే దిక్సూచిగా నిలిచేలా ఏర్పాట్లు ఉండాలని మంత్రి శ్రీహరి ఆకాంక్షించారు. క్రీడాకారులకు అత్యుత్తమ వసతులు కల్పిస్తూ, పోటీల నిర్వహణలో ఎక్కడా లోపాలు లేకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని చెప్పారు. ఈ పోటీలు రాష్ట్ర క్రీడా రంగానికి కొత్త దిశానిర్దేశం చేయడంతోపాటు రాష్ట్ర యువతలో క్రీడల పట్ల ఆసక్తిని మరింత పెంచేలా ఉండాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ క్రీడల సలహాదారు, తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోని బాలాదేవి, తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, ప్రవీణ్ కుమార్ మల్లారెడ్డి, డిప్యూటీ డైరెక్టర్లు రవీందర్, రవితేజ, అశోక్, శ్రీనివాస్, ఇంజినీర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





రంజోల్‌లో తుల్జాపూర్ భక్తులకు ఘనంగా అన్నప్రసాద వితరణ

- **కాలినడకన వెళ్లే భక్తులకు సేవలందించిన నిర్వాహకులు**

జహీరాబాద్, అక్టోబర్ 23 (ఆశ్వి అప్డేట్స్):

జహీరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రంజోల్‌లో మహారాష్ట్రలోని తుల్జాపూర్ భవానీ మాత దర్శనానికి కాలినడకన వెళ్తున్న భక్తుల కోసం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

శ్రీకాంత్ రెడ్డి, గుర్నాథ్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, గుండారెడ్డి, మైపాల్ రెడ్డి, నారాయణరెడ్డి సంయుక్త ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం జరిగింది. వందలాది మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నరేష్ గౌడ్, చంద్రశేఖర్ రెడ్డి, నరసింహారెడ్డి, జగన్ రెడ్డి, నారాయణరెడ్డి, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొని భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, కాలినడకన వెళ్లే భక్తులకు ఆహారం అందించి వారి అలసటను తీర్చడం తమకు సంతోషంగా ఉందన్నారు. “మానవ సేవే మాధవ సేవ” అనే భావనతో ప్రతి సంవత్సరం అమ్మవారి ఆశీస్సులతో ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్నప్రసాదం స్వీకరించిన భక్తులు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



దళిత యువకుడి ఆలయ ప్రవేశం అడ్డుకోవడంపై వనపర్తిలో ధర్నా

- **నిందితులను వెంటనే అరెస్టు చేయాలి.. డీఎస్పీ డిమాండ్**

ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో | అక్టోబర్ 23 | ఆశ్వి అప్డేట్స్:

మంగంపల్లి గ్రామంలో దళిత యువకుడు సుధీర్‌ను ఆంజనేయస్వామి ఆలయంలోకి వెళ్లకుండా అడ్డుకుని, కులదూషణకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలని ధర్మ సమాజ్ పార్టీ (డీఎస్పీ) డిమాండ్ చేసింది. ఈ ఘటనకు నిరసనగా శుక్రవారం వనపర్తి జిల్లా కేంద్రంలో డీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా డీఎస్పీ, జేఏసీ జిల్లా కన్వీనర్ చిలుక బాలరాజ్ సాగర్, జిల్లా నాయకుడు మధు మాట్లాడుతూ, ఈ ఘటన రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కులకు, బహుజనుల ఆత్మగౌరవానికి భంగం కలిగించిందని పేర్కొన్నారు. పోలీసులు వెంటనే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఈ ధర్నాకు బీఆర్ఎస్ నాయకుడు గట్టు యాదవ్, మాజీ జడ్పీటీసీ శేఖర్ నాయక్, రాములు యాదవ్, ఎంఆర్పీఎస్, కుల అసమానతల వ్యతిరేక పోరాట సమితి నాయకుడు గోవింద్‌తో పాటు వివిధ కుల సంఘాల ప్రతినిధులు సంఘీభావం తెలిపారు.



ఎల్‌నినో నేపథ్యంలో ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి

- **ఖేత్ బచావో అభియాన్‌లో శాస్త్రవేత్తల సూచన**

ఆశ్వి అప్డేట్స్ | చిట్యాల, అక్టోబర్ 23:

ఎల్‌నినో ప్రభావాల నేపథ్యంలో రైతులు తక్కువ నీరు అవసరమయ్యే ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని శాస్త్రవేత్తలు సూచించారు. నల్గొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ‘ఖేత్ బచావో అభియాన్’లో భాగంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. హైదరాబాద్‌లోని జాతీయ మెట్ట పరిశోధన సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. ఏవీఎం సుబ్బారావు, సీనియర్ సైంటిస్ట్ డా. కీర్తిక మాట్లాడుతూ రైతులు స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని, సమతుల్య ఎరువులను వినియోగిస్తూ నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. భూసారాన్ని పరిరక్షించి, ఆరోగ్యకరమైన పంటలను సాగు చేయడం ద్వారా రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. మండల వ్యవసాయ అధికారి పగిడిమర్రి బాబు మాట్లాడుతూ నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఈ యాసంగి సీజన్‌లో నీటి వినియోగం అధికంగా ఉండే వరికి బదులుగా పెసర్లు, మినుములు, జొన్నలు, నువ్వులు, వేరుశనగ వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని సూచించారు. భూగర్భ జలాలు తగ్గడం, ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వంటి పరిస్థితులు వ్యవసాయంపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు.

ఆరుతడి పంటలకు అవసరమైన విత్తనాలను వ్యవసాయ శాఖ ద్వారా సమకూర్చునున్నట్లు తెలిపారు. రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వాసుదేవ్, చిన్నకాపర్తి గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.





చీకటి గుప్పిట్లో చిట్యాల బస్టాండ్.. ప్రయాణికుల భద్రత గాలిలో దీపమేనా?

- **వెలగని వీధి దీపాలు.. చీకట్లోనే మహిళలు, వృద్ధులు, విద్యార్థుల నిరీక్షణ***
- **జాతీయ రహదారికి సమీపంలోనే సమస్య.. ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?***
- **ప్రజా ధనం వసూలులో ఉన్న శ్రద్ధ.. కనీస సౌకర్యాల కల్పనలో ఏదీ?***

ఆశ్వి అప్డేట్స్ | చిట్యాల:

ప్రజలకు సురక్షితమైన ప్రయాణ వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. కానీ చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన బస్టాండ్ పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. పట్టణానికి కీలకమైన ఈ బస్టాండ్ రాత్రివేళల్లో చిమ్మచీకటిలో మగ్గుతుండటంతో ప్రయాణికుల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. బస్టాండ్ ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లోనే కాకుండా, బస్టాండ్ లోపల, భువనగిరి రోడ్డుకు వెళ్లే దారిలోనూ సరైన వెలుతురు లేకపోవడం సమస్య తీవ్రతను తెలియజేస్తోంది.

ఇది కేవలం వీధి దీపాల సమస్య మాత్రమే కాదు.. ప్రజల భద్రత, మహిళల స్వేచ్ఛగా ప్రయాణించే హక్కు, వృద్ధులు, విద్యార్థులు రాత్రివేళల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులకు సంబంధించిన ప్రజా సమస్య. ప్రతిరోజూ బస్సుల కోసం వచ్చే ప్రయాణికులు కనీస వెలుతురు కూడా లేకుండా నిరీక్షించాల్సి రావడం పట్టణ మౌలిక సదుపాయాల నిర్వహణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

చీకట్లో ప్రయాణం.. అడుగడుగునా ఆందోళన!

జాతీయ రహదారికి సమీపంలో ఉన్న చిట్యాల బస్టాండ్‌కు ప్రతిరోజూ అనేక మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి ఈ బస్టాండ్‌పై ఆధారపడుతున్నారు. అయితే సూర్యాస్తమయం తర్వాత సరైన వెలుతురు లేకపోవడంతో బస్సుల కోసం వేచి ఉండటం, బస్టాండ్ నుంచి బయటకు వెళ్లడం కూడా ఇబ్బందికరంగా మారుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హైమాస్ట్ లైట్లు లేకపోవడంతో పాటు, ఉన్న చిన్న లైట్లు సైతం సరిగా పనిచేయడం లేదని ప్రయాణికులు చెబుతున్నారు. చీకటిలో గుంతలు కనిపించకపోవడం, విషపురుగుల భయం, పరిసరాల్లో అసాంఘిక కార్యకలాపాలు జరిగే అవకాశం ఉండటం ప్రయాణికుల్లో అభద్రతా భావాన్ని పెంచుతున్నాయి. ముఖ్యంగా రాత్రివేళల్లో ఒంటరిగా ప్రయాణించే మహిళలు, వృద్ధుల పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

ప్రమాదం జరిగాక స్పందిస్తారా?

ప్రజా భద్రత విషయంలో ముందస్తు చర్యలే కీలకం. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, అలాంటి పరిస్థితులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించడం అధికారుల బాధ్యత. బస్టాండ్ వంటి ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతంలో తగిన లైటింగ్ లేకపోవడం వల్ల ప్రమాదాల ముప్పు పెరిగే అవకాశం ఉంది.

చీకటిగా ఉన్న ప్రాంతాల్లో భద్రతాపరమైన సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు తగిన వెలుతురు, అవసరమైన పర్యవేక్షణ, సురక్షితమైన రాకపోకల మార్గాలు ఉండాలి. ఈ నేపథ్యంలో చిట్యాల బస్టాండ్ సమస్యను సాధారణ నిర్వహణ లోపంగా కాకుండా, ప్రజా భద్రతకు సంబంధించిన అత్యవసర అంశంగా అధికారులు పరిగణించాల్సిన అవసరం ఉంది.

పన్నులు వసూలు చేస్తారు.. సౌకర్యాలు కల్పించరా?

మున్సిపాలిటీ పరిధిలో ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తున్న అధికారులు, వారికి అవసరమైన కనీస మౌలిక సదుపాయాల కల్పనలోనూ అదే స్థాయిలో బాధ్యత చూపాలని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. బస్టాండ్‌లో వెలుతురు సమస్యపై పలుమార్లు విన్నవించినా పరిష్కారం కనిపించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు.

పట్టణ అభివృద్ధి అంటే రహదారులు, భవనాలు నిర్మించడం మాత్రమే కాదు. ప్రజలు నిర్భయంగా ప్రయాణించేందుకు అవసరమైన వెలుతురు, భద్రత, పరిశుభ్రత వంటి ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉండటమూ అభివృద్ధిలో భాగమే. ఈ అంశాన్ని మున్సిపల్ అధికారులు గుర్తించాలని ప్రజలు కోరుతున్నారు.

తక్షణ చర్యలు తీసుకోవాలి

చిట్యాల బస్టాండ్‌లో నెలకొన్న చీకటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బస్టాండ్ మధ్యలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలు, భువనగిరి రోడ్డుకు వెళ్లే దారిలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇప్పటికే ఉన్న లైట్లు పనిచేయకపోతే వాటిని తక్షణమే మరమ్మతు చేసి, నిరంతరం పనిచేసేలా నిర్వహణ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలు సురక్షితంగా ప్రయాణించడం కనీస హక్కు. చిట్యాల బస్టాండ్‌లో వెలుతురు కల్పించడం అధికారులకు అదనపు భారం కాదు.. అది వారి బాధ్యత. ఇప్పటికైనా మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి, చీకటి సమస్యకు స్వస్తి పలుకుతారా? లేక ప్రయాణికుల ఇబ్బందులు ఇలాగే కొనసాగుతాయా? అన్నది వేచి చూడాలి.



మంద వేణుగోపాల్ రెడ్డి
చిట్యాల :రిపోర్టర్

డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనల్లో కీలక మార్పులకు ప్రతిపాదన

- **పాస్ మార్కులు 60 నుంచి 75 శాతానికి పెంపు యోచన***

ఆశ్వి అప్డేట్స్:

డ్రైవింగ్ లైసెన్స్ నిబంధనల్లో మార్పులు తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించినట్లు సమాచారం. సురక్షిత డ్రైవింగ్ ట్యుటోరియల్ పరీక్షలో ప్రస్తుతం ఉన్న 60 శాతం ఉత్తీర్ణత మార్కులను 75 శాతానికి పెంచాలని ప్రతిపాదించింది.

అలాగే లైసెన్స్‌లో పేరు, చిరునామా, మొబైల్ నంబర్ వంటి వివరాల మార్పులకు గడువులు విధించడం, పరివాహన్ పోర్టల్ ద్వారా కొన్ని ఆన్‌లైన్ సేవలను ఉచితంగా అందించడం వంటి అంశాలు ప్రతిపాదనల్లో ఉన్నాయి. గుర్తింపు పొందిన డ్రైవింగ్ స్కూళ్లలో శిక్షణ పొందిన వారికి ప్రాక్టికల్ డ్రైవింగ్ పరీక్ష నుంచి మినహాయింపు కొనసాగే అవకాశం ఉంది.



ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠాలపై ఈడీ ఉక్కుపాదం

- **హైదరాబాద్, విజయవాడల్లో ఏజెంట్లు, హవాలా నిర్వాహకులపై సోదాలు**
- **200కు పైగా షెల్ కంపెనీల ద్వారా నిధుల మళ్లింపు**
- **క్రిప్టోకరెన్సీ రూపంలో దుబాయ్‌కు నగదు తరలింపు**
- **ఎడ్‌సోమ్ ఫిన్‌టెక్ వ్యవస్థాపకుడు రాంధానీ అరెస్టు**


హైదరాబాద్, అక్టోబరు 23, ఆశ్వి అప్డేట్స్:

ఆన్‌లైన్ బెట్టింగ్, గేమింగ్ యాప్‌ల ద్వారా సాగుతున్న అక్రమ లావాదేవీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తును ముమ్మరం చేసింది. గతవారం మహారాష్ట్ర, గుజరాత్‌లలో నిర్వహించిన సోదాల్లో లభించిన ఆధారాల ఆధారంగా తాజాగా హైదరాబాద్, విజయవాడల్లో స్థానిక ఏజెంట్లు, హవాలా నిర్వాహకులపై దాడులు చేపట్టింది.

పుణె సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ విచారణ చేపట్టింది. గతవారం ముంబై, పుణె, సూరత్, మెహసానాలో 20కి పైగా ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించింది. ‘ఐపైసా’ వంటి గేమింగ్, చెల్లింపుల వేదికల ద్వారా అక్రమ బెట్టింగ్ కార్యకలాపాలు సాగించినట్లు గుర్తించింది.

బెట్టింగ్ ద్వారా సంపాదించిన సొమ్మును నేరుగా తరలించకుండా దేశవ్యాప్తంగా 200కు పైగా షెల్ కంపెనీలు, పలు సహకార బ్యాంకుల ఖాతాల ద్వారా మళ్లించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం క్రిప్టోకరెన్సీగా మార్చి దుబాయ్‌తో పాటు ఇతర విదేశీ ఖాతాలకు తరలించినట్లు సాంకేతిక ఆధారాలు లభించాయి.

గతవారం సోదాల్లో హార్డ్‌డిస్క్‌లు, ల్యాప్‌టాప్‌లు, ఆర్థిక లావాదేవీల రికార్డులను స్వాధీనం చేసుకున్న ఈడీ.. అనుమానాస్పద బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసింది. ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించిన ఎడ్‌సోమ్ ఫిన్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు రాంధానీని అరెస్టు చేసి విచారించింది. ఆ విచారణలో వెల్లడైన వివరాలు, స్వాధీనం చేసుకున్న డిజిటల్ ఆధారాల ఆధారంగా తెలుగు రాష్ట్రాల్లో తదుపరి చర్యలు చేపట్టినట్లు సమాచారం.



తాళ్లవెల్లంలలో పశువుల అపహరణ

- **ఇద్దరు రైతులకు చెందిన నాలుగు పశువులు మాయం.. పోలీసులకు ఫిర్యాదు**

ఆశ్వి అప్డేట్స్ | చిట్యాల, అక్టోబర్ 23:

నల్గొండ జిల్లా చిట్యాల మండలం తాళ్లవెల్లంల గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇద్దరు రైతులకు చెందిన నాలుగు పశువులను అపహరించుకెళ్లారు. గురువారం రాత్రి పొలాల వద్ద కట్టేసిన పశువులు శుక్రవారం ఉదయం కనిపించకపోవడంతో బాధిత రైతులు ఆందోళనకు గురయ్యారు.

గ్రామానికి చెందిన దోసపాటి శంకర్ కురుమద్ల వెళ్లే దారిలోని తన బావి వద్ద రెండు పశువులను కట్టేసి ఇంటికి వెళ్లాడు. అదేవిధంగా జింకల ప్రసాద్ మునుగోడు వెళ్లే దారిలోని తన పొలం వద్ద ఒక ఆవు, దూడను కట్టేసి వెళ్లాడు. శుక్రవారం ఉదయం వెళ్లి చూడగా నాలుగు పశువులు కనిపించలేదు.

దీంతో బాధిత రైతులు చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు స్పందించి పశువుల ఆచూకీ కనుగొని, అపహరణకు పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఆరెగూడెంలో 400 గ్యాస్ కనెక్షన్లకు పైపుల పంపిణీ

- **రూ.2 లక్షల విలువైన పైపులు అందజేసిన సర్పంచ్ నాగంపల్లి శ్యాంసుందర్**

ఆశ్వి అప్డేట్స్ | చిట్యాల, అక్టోబర్ 23:

నల్గొండ జిల్లా చిట్యాల మండలం ఆరెగూడెం గ్రామంలో 400 గ్యాస్ కనెక్షన్లదారులకు శుక్రవారం రూ.2 లక్షల విలువైన గ్యాస్ పైపులను సర్పంచ్ నాగంపల్లి శ్యాంసుందర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జుంజు రాజు, వార్డు సభ్యుడు రాచమల్ల మహేష్, నాయకులు సాపిడి అశోక్, లడె శ్రీను, సిందే అంజనేయులు, ఎడ్డె ఉమేష్, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



తల్లి కోసం 8 వేల కిలోమీటర్ల పరుగు

- **తల్లి కోలుకోవడంతో మొక్కు తీర్చుకుంటున్న 19 ఏళ్ల మోనూ**
- **ఇప్పటివరకు ఆరు జ్యోతిర్లింగాల దర్శనం**
- **రోజుకు 50 కిలోమీటర్లు పరిగెత్తుతున్న బిహార్ యువకుడు**
- **మిగిలిన ఆరు క్షేత్రాల దర్శనం తర్వాతే ఇంటికి వెళ్లాలని సంకల్పం**

బిహార్‌కు చెందిన 19 ఏళ్ల మోనూ మెటుర్భా లా తల్లి ఆరోగ్యం కోసం చేసిన మొక్కును తీర్చుకునేందుకు ద్వాదశ జ్యోతిర్లింగాల యాత్ర చేపట్టాడు. 2026 మార్చి 15న పాట్నా నుంచి ప్రారంభమైన ఈ యాత్రలో ఇప్పటివరకు సుమారు 8 వేల కిలోమీట ర్లు ప్రయాణించి ఆరు జ్యోతిర్లింగాలను దర్శించుకున్నాడు. ప్రస్తుతం మహారాష్ట్రలో ఉన్న అతడు రోజుకు 50 కిలోమీటర్లు పరి గెత్తుతూ మిగిలిన క్షేత్రాలను చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. మోనూ తల్లి లలీ్త దేవి గొంతులో చేప ముల్లు ఇరుక్కోవడం తో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఆమె కోలుకోవాలని పరమశివుడిని ప్రార్థించిన మోనూ, ఆరోగ్యం బాగుపడితే జ్యోతిర్లింగా లను దర్శిస్తానని మొక్కుకున్నాడు. కుటుం బానికి ఆర్థికంగా అండగా ఉండేందుకు పానీపూరీ విక్రయించే అతడు, ఆర్థిక ఇబ్బం దులున్నా యాత్రకు బయలుదేరాడు. మరో ఇద్దరు యువకులు కూడా అతడికి తోడుగా ప్రయాణిస్తున్నారు. కుమారుడు మొక్కును నెరవేర్చుకుంటుండటంపై తల్లి ఆనందం వ్యక్తం చేస్తుండగా, యాత్ర ముగించుకుని క్షేమంగా తిరిగి రావాలని కుటుంబ సభ్యులు ఆకాంక్షిస్తున్నారు.



వందేమాతరం ఉత్తర్వులపై సుప్రీంకోర్టులో పిటిషన్

- **ఆరు చరణాల గేయాన్ని తప్పనిసరి చేయడంపై అభ్యంతరం**
- **కేంద్రం ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమని మాజీ ఐపీఎస్ అధికారి వాదన**
- **తొలి రెండు చరణాలనే జాతీయ గేయంగా గుర్తించాలని విజ్ఞప్తి**
- **మత విశ్వాసాల కారణంగా పాడని వారిపై చర్యలు తీసుకోవద్దని అభ్యర్థన**

న్యూఢిల్లీ, అక్టోబరు 23 ఆశ్వి అప్డేట్స్:

ప్రభుత్వ, విద్యా కార్యక్రమాల్లో ఆరు చరణాల 'వందేమాతరం' గేయాన్ని ఆలపించా లంటూ కేంద్రం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ కేరళకు చెందిన మాజీ ఐఏఎస్ అధికారి బాలకృష్ణన్ సత్యభామ మావోజీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ ఏడాది జనవరి 28, జులై 9 తేదీల్లో జారీ చేసిన ఉత్త ర్వులు రాజ్యాంగానికి విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. 'ఆనందమఠ్' నవలలోని పూర్తి గేయంలో హిందూ దేవతల ప్రస్తావనలు, మతపరమైన అంశాలు ఉన్నాయని, దానిని ఆలపించాలని బలవంతం చేయడం మన స్సాక్షి స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందని పిటి షనర్ వాదించారు. రాజ్యాంగంలోని 14, 19, 21, 25, 28 అధికరణలకు ఇవి విరుద్ధ మని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి జాతీయ గేయంగా గుర్తింపు పొందిన తొలి రెండు చరణాలు మాతృభూమి గొప్ప దనాన్ని మాత్రమే వర్ణిస్తాయని తెలిపారు. రవీంద్రనాథ్ ఠాగూర్, 1937లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ కూడా తొలి రెండు చరణా లనే ఆమోదించాయని గుర్తుచేశారు. కేంద్రం ఉత్తర్వులను రద్దు చేసి, తొలి రెండు చరణా లనే అధికారికంగా జాతీయ గేయంగా ప్ర కటించాలని, మత విశ్వాసాల కారణంగా గేయాన్ని ఆలపించని వారిపై చర్యలు తీ సుకోకుండా ఆదేశించాలని కోరారు. ఇదే అంశంపై సంగీత విద్వాంసుడు టీఎం కృష్ణ సహా మరికొందరు గతంలోనూ సుప్రీంకోర్టు ను ఆశ్రయించారు.

రైహాన్ ఫొటో ఎగ్జిబిషన్‌పై కాంగ్రెస్‌లో విభేదాలు

- **రాహుల్ మౌనంపై ప్రదీప్ భండారీ విమర్శలు**
- **105 ఫొటోల్లో 74 తొలగింపు లేదా మార్పునకు సూచన**
- **రాజకీయ ఫొటోల చేర్పుపై బికనేర్ హౌస్ అభ్యంతరం**
- **కుమారుడిని రాజకీయాల్లోకి తెచ్చేందుకు ప్రియాంక ప్రయత్నిస్తున్నారని బీజేపీ ఆరోపణలు**

న్యూఢిల్లీ, అక్టోబరు 23, ఆశ్వి అప్డేట్స్:

కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ కుమారుడు రైహాన్ వాద్రా ఫొటో ఎగ్జిబిషన్ వివాదం రాజకీయ ఆరోపణలకు దారితీ సింది. ఈ వ్యవహారంలో రాహుల్ గాంధీ మౌనంగా ఉండటాన్ని ప్రస్తావిస్తూ, కాంగ్రె స్‌లో ప్రియాంక-రాహుల్ మధ్య విభేదాలు ఉన్నాయని బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ ఆరోపించారు. రైహాన్‌ను రాజకీ యాల్లోకి తీసుకురావడానికి ప్రియాంక ప్రయ త్నిస్తున్నారని విమర్శించారు. ఢిల్లీలోని బికనేర్ హౌస్‌లో 'నో ఐడియా ఈజ్ ఫైనల్' పేరుతో నిర్వహించాలనుకున్న ప్రదర్శనలో 105 ఫొటోల్లో 74 ఫొటోలను తొలగించాలని లేదా మార్చాలని నిర్వాహకులు సూచించడంతో చివరకు 35 ఫొటోలతోనే ప్రదర్శన ప్రారంభ మైంది. విద్యార్థుల నిరసనలకు సంబంధిం చిన చిత్రాలను తొలగించడంపై ప్రియాంక అభ్యంతరం వ్యక్తం చేయగా, వేదిక నిబంధన లకు అనుగుణంగా లేని ఫొటోలను మాత్రమే తొలగించామని బికనేర్ హౌస్ తెలిపింది. మొదట రైహాన్ పంపిన ప్రతిపాదనలో ప్రకృతి, వన్యప్రాణులు, కళాఖండాలు, పోర్ట్రెయిట్స్ వంటి అంశాలే ఉన్నాయని, తర్వాత రాజకీయ ఫొటోలు చేర్చారని ఈమెయిల్ వివరాలను ఉటంకిస్తూ భండారీ పేర్కొన్నారు. కుటుంబ ఒత్తిడితోనే రాజకీయ అంశాలు చేర్చారన్నది బీజేపీ ఆరోపణ కాగా, ఈ వివాదంపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

విఫలమైన ఉత్పత్తి'ని ప్రమోట్ చేసేందుకు దేశాన్ని పణంగా పెడతారా?

- **కాంగ్రెస్‌పై ప్రధాని మోదీ తీవ్ర విమర్శలు**
- **'దిమాగీ నక్సల్స్' ఆ పార్టీ ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేస్తున్నారు**
- **విదేశాల్లో భారత్ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నారని ఆరోపణ**
- **పార్లమెంటులో ఇతర ప్రతిపక్ష నేతల గొంతు నొక్కుతున్నారని వ్యాఖ్యలు**

న్యూఢిల్లీ, అక్టోబరు 23, ఆశ్వి అప్డేట్స్:

"తమ విఫలమైన ఉత్పత్తిని ప్రమోట్ చేసేందుకు కాంగ్రెస్ ఇంకా ఎంతకాలం దేశాన్ని పణంగా పెడుతుంది?" అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీపై తీవ్ర విమర్శలు చేస్తూ, ఆ పార్టీ ఆలోచనా విధానాన్ని 'దిమాగీ నక్సల్స్' తమ ఆధీనంలోకి తీసుకున్నారని ఆరోపించారు. గురువారం ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్‌లో ప్రసం గించిన ఆయన.. అంతర్జాతీయ పరిణామాలు, భారతదేశ ప్రతిష్ఠ, పార్లమెంటులో ప్రతిపక్షాల వ్యవహారశైలిపై వ్యాఖ్యలు చేశారు.

ప్రపంచం కొత్త అంతర్జాతీయ వ్యవస్థ కోసం ఎదురుచూస్తున్న తరుణంలో భారత్ తన బలాన్ని, స్థిరత్వాన్ని ప్రపంచానికి చాటాల్సిన అవసరం ఉందని మోదీ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక పరిణామాలు చోటుచేసుకుం టున్న నేపథ్యంలో దేశం ఐక్యతతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమ ర్శించారు. విదేశాలకు వెళ్లి భారత్ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నాలు చేయడంతో పాటు, దేశ అంతర్గత వ్యవహారాల్లో విదేశీ జోక్యాన్ని కోరు తోందని ఆరోపించారు.

'దిమాగీ నక్సల్స్' కాంగ్రెస్ ఆలోచనా విధానా న్ని ప్రభావితం చేస్తున్నారని ప్రధాని వ్యాఖ్యానిం చారు. ఈ కారణంగా ఆ పార్టీ స్వతంత్రంగా ఆలోచించే సామర్థ్యాన్ని కోల్పోయిందని విమ ర్శించారు. గతంలో అడవుల్లో విధ్వంసానికి పాల్పడినవారు ఇప్పుడు కాంగ్రెస్‌లోకి చొరబడి దేశానికి నష్టం కలిగించే ప్రయత్నాలు చేస్తున్నా రని ఆరోపించారు. కాంగ్రెస్ వ్యవహారశైలి వల్ల ప్రభుత్వాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా విమర్శించా లనుకునే ఇతర ప్రతిపక్ష నేతలకు కూడా ఇబ్బం దులు ఎదురవుతున్నాయని అన్నారు.

ఒక రాజకీయ కుటుంబ ప్రయోజనాల కోసం దేశ అభివృద్ధి, విజయాలను వివాదాల్లోకి లాగడం సరికాదని మోదీ పేర్కొన్నారు. కాంగ్రెస్ తన రాజకీయ పతనానికి తానే కారణ మవుతోందని వ్యాఖ్యానించారు. పార్టీ సీనియర్ నేతలు అంతర్గతంగా అసంతృప్తి వ్యక్తం చేస్తు న్నప్పటికీ బహిరంగంగా మాట్లాడటం లేదని ఆరోపించారు. పార్టీ నాయకత్వంపై విమర్శలు వచ్చినప్పుడు దేశ విజయాలు, ప్రభుత్వ సంస్థల పనితీరును కూడా రాజకీయ వివాదాల్లోకి తీసు కొస్తున్నారని విమర్శించారు.

పార్లమెంటులో కాంగ్రెస్ నిరసనలు, గందరగో ళం కారణంగా ఇతర ప్రతిపక్ష పార్టీల యువ ఎంపీలు ప్రజా సమస్యలను ప్రస్తావించేందుకు, ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు తగిన అవకాశం దక్కడం లేదని ప్రధాని అన్నారు. ఒకే నాయకు డిని రాజకీయంగా ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఇతర ప్రతిపక్ష నేతల గొంతులను అణచివేస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ విధా నాలను విమర్శించడం, ప్రజా సమస్యలపై నిర



సనలు చేపట్టడం ప్రజాస్వామ్యంలో సహజమని పేర్కొంటూనే, నిర్మాణాత్మకంగా సమస్యలను ప్రస్తావించే ప్రయత్నాలను కూడా కాంగ్రెస్ దారి మళ్లిస్తోందని విమర్శించారు.

ఇతర ప్రతిపక్ష పార్టీల రాజకీయ ఎదుగుదలకు అడ్డుపడుతున్న కాంగ్రెస్‌ను మోదీ 'పరాన్న జీవి'గా అభివర్ణించారు. కాంగ్రెస్ వైఖరి వల్ల ప్రభుత్వాన్ని నిర్మాణాత్మకంగా విమర్శించాల నుకునే నేతల స్వరాలు కూడా ప్రజలకు వినిపిం చడం లేదని అన్నారు.

ఎల్ఏసీ వద్ద ఉద్రిక్తతలపై కేంద్రం స్పందన

- **చైనా సైన్యం గస్తీ విధానాల నుంచి తప్పుకుంటే ఉద్రిక్తతలు: విదేశాంగ శాఖ**
- **సరిహద్దు సమస్యల పరిష్కారానికి భారత్-చైనా చర్చలు**
- **సరిహద్దు యూనిట్లలో డ్రోన్ ప్లాటూన్లు ఏర్పాటు**
- **గల్వాన్ తరహా పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక శిక్షణ**

న్యూఢిల్లీ, అక్టోబరు 23, ఆశ్వి అప్డేట్స్:

అరుణాచల్‌ప్రదేశ్‌లో భారత్‌చైనా వాస్తవ నియంత్రణ రేఖ (ఎల్ఏసీ) వెంబడి ఉద్రిక్తత లపై ఇండోటిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డీజీ శత్రుజీత్ సింగ్ కపూర్ చేసిన వ్యాఖ్యలపై విదేశాంగ శాఖ స్పందించింది. చైనా సైనికులు గతంలో అంగీకరించిన గస్తీ విధానాలను పాటిం చనప్పుడు సరిహద్దు ప్రాంతాల్లో అప్పుడప్పుడు ఉద్రిక్త పరిస్థితులు తలెత్తుతున్నాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వాన్ని కొనసాగించేం దుకు భారత్‌చైనా ద్వైపాక్షిక సంబంధాలు కీల కమని ఆయన పేర్కొన్నారు. ఎల్ఏసీ వెంబడి ఉన్న సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు అపార్థాలు, తప్పుడు అంచనాలను నివా రించేందుకు ఇరు దేశాలు దౌత్య, సైనిక మార్గా ల్లో చర్చలు కొనసాగిస్తున్నాయని వివరించారు. అరుణాచల్‌ప్రదేశ్‌లో చైనా సైనికులతో ఘర్షణ పరిస్థితులు కొనసాగుతున్నాయన్న ఐటీబీపీ డీజీ వ్యాఖ్యలపై మరిన్ని వివరాల కోసం రక్షణ మం త్రిత్వ శాఖను సంప్రదించాలని సూచించారు. సరిహద్దు నిర్వహణను మెరుగుపరిచేందుకు



ఎల్ఏసీపై ఇరు దేశాల అవగాహనను పెంచే మార్గాలపై చర్చించేందుకు భారత్, చైనా అంగీక రించాయని తెలిపారు. రాజస్థాన్‌లోని అల్వార్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఐటీబీపీ డీజీ శత్రుజీత్ సింగ్ కపూర్ మాట్లాడుతూ.. సరిహద్దు భద్రతను బలోపేతం చేసేందుకు అన్ని సరిహద్దు యూనిట్లలో డ్రోన్ ప్లాటూన్లను ఏర్పాటు చేసిన ట్లు వెల్లడించారు. గల్వాన్ తరహా పరిస్థితులను మరింత సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రత్యేక స్ట్రైక్ శిక్షణ కోర్సులను రూపొందించినట్లు తెలిపారు.

రూ.326 కోట్ల బ్యాంకు మోసం కేసులో ఈడీ సోదాలు

- **కనకధార వెంచర్స్ కార్యాలయాలు, డైరెక్టర్ల నివాసాల్లో తనిఖీలు**
- **హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్ పరిధిలో ఏడు చోట్ల సోదాలు**
- **నకిలీ ఇన్‌వాయిస్‌లతో నిధుల మళ్లింపు**
- **కీలక పత్రాలు, డిజిటల్ పరికరాలు స్వాధీనం**

హైదరాబాద్, అక్టోబరు 23, ఆశ్వి అప్డేట్స్:

బ్యాంకుల కన్సార్టియంను మోసగించి రూ.326.49 కోట్ల నిధులను దారిమ ళ్లించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న కనకధార వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సోదాలు



నిర్వహించింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్‌ఏ)2002 కింద హైదరాబాద్, సికింద్రాబాద్, మేడ్చల్‌మల్కాజ్‌గిరి పరిధిలో శుక్రవారం ఏడు ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టింది.

కంపెనీ రిజిస్టర్డ్ కార్యాలయం, డైరెక్టర్ల నివాసా లతో పాటు నిధుల మళ్లింపులో మధ్యవర్తులుగా వ్యవహరించినట్లు అనుమానిస్తున్న సంస్థలు, వ్యక్తులకు చెందిన ప్రాంగణాల్లో సోదాలు జరిగాయి. పంజాబ్ నేషనల్ బ్యాంకు ఫిర్యాదు మేరకు సీబీఐ బెంగళూరు విభాగం 2022 డిసెంబరు 8న నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ దర్యాప్తు చేపట్టింది. ఐపీసీ సెక్షన్లు 120బి, 420, 468, 471తో పాటు అవినీతి నిరోధక చట్టం కింద నమోదైన కేసులో మనీలాండరింగ్ కోణాన్ని పరిశీలిస్తోంది. పంజాబ్ నేషనల్ బ్యాంకు నేతృత్వంలోని ఐడీబీఐ బ్యాంకు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రా బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరో డాలతో కూడిన కన్సార్టియం నుంచి కంపెనీ రుణ సౌకర్యాలు పొందినట్లు దర్యాప్తులో వెల్లడైంది. బ్యాంక్ గ్యారెంటీలు, లెటర్ ఆఫ్ క్రెడిట్ సదుపాయాలను దుర్వినియోగం చేసి నిధులను మళ్లించినట్లు ఆరోపణలున్నాయి. నకిలీ ఉక్కు కొనుగోలు ఇన్‌వాయిస్‌లు, రవాణా పత్రాలు సృష్టించి, బినామీ సంస్థల ద్వారా డబ్బును ఇతర ఖాతాలకు తరలించిన ట్లు అధికారులు అనుమానిస్తున్నారు. కన్సార్టి యం బ్యాంకులకు తెలియకుండా ఇతర బ్యాం కుల్లో ఖాతాలు నిర్వహించినట్లు ఆధారాలు సేకరించారు. తాజా సోదాల్లో నిధుల మళ్లింపు, లేయరింగ్‌కు సంబంధించిన పత్రాలు, డిజిటల్ పరికరాలు, ఇతర రికార్డులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పలు స్థిరాస్తులు, పెట్టు బడులను గుర్తించి వాటి వివరాలను నమోదు చేశారు. కేసులో మరిన్ని ఆధారాల సేకరణకు ఈడీ దర్యాప్తు కొనసాగిస్తోంది.

నేహా బోరా పిటిషన్ కొట్టివేత

- **రూ.10 వేల పీస్ బాండ్ నోటీసులపై ఢిల్లీ హైకోర్టు నిర్ణయం**
- **తిరంగా మార్చ్ సందర్భంగా నిబంధనల ఉల్లంఘన ఆరోపణలు**
- **ముందస్తు శాంతిభద్రతల చర్యగానే నోటీసులిచ్చామన్న పోలీసులు**
- **ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతోందన్న నేహా బోరా తరపు న్యాయవాది**

న్యూఢిల్లీ, అక్టోబరు 23, ఆశ్వి అప్డేట్స్:

ఢిల్లీ నిరసనల నేపథ్యంలో తనకు జారీ చేసిన రూ.10 వేల పీస్ బాండ్ నోటీసులను సవాల్ చేస్తూ ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) అధ్యక్షురాలు నేహా బోరా దాఖలు చేసిన పిటిషన్‌ను ఢిల్లీ హైకోర్టు శుక్రవారం కొ



ట్టివేసింది. శాంతిభద్రతలను కాపాడేందుకు పూచీకత్తుతో పాటు వ్యక్తిగత బాండ్ సమర్పించా లని న్యూఢిల్లీలోని స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ అక్టోబరు 17న ఆమెకు నోటీసులు జారీ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబరు 16న నేహా బోరా వామపక్ష విద్యార్థి సంఘాలతో కలిసి తిరంగా మార్చ్ నిర్వహించారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణ లతో ఈ నిరసన చేపట్టారు. జంతర్‌మంతర్ వద్ద నిరసనలకు విధించిన పరిమితులను ఉల్లంఘిం చి, ప్రజలను కన్నాట్ ప్లేస్ వైపు వెళ్లేలా ఆమె ప్రే రేపించారని నోటీసుల్లో ఆరోపించారు. కోర్టులో వాదనల సందర్భంగా తాను శాంతిభద్రతలకు భంగం కలిగించలేదని, కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఇచ్చిన పిలుపుతో తనకు సంబంధం లేదని నేహా బోరా తరపు న్యాయవాది పేర్కొన్నా రు. నోటీసులు రాజ్యాంగంలోని 19, 21వ అధిక రణాల ద్వారా కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగిస్తున్నాయని వాదించారు.

ఢిల్లీ పోలీసుల తరపున అదనపు సొలిసిటర్ జనరల్ చేతన్ శర్మ వాదిస్తూ.. నేహా బోరా ని బంధనలు ఉల్లంఘించినట్లు ఆరోపిస్తున్న 12 సందర్భాలను కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. శిక్ష విధించడం కోసం కాకుండా, ముందస్తుగా శాంతిభద్రతలను కాపాడేందుకే నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ప్రశాంత్ భూషణ్, సీజేపీ నాయకులు పాల్గొన్న సమావేశంలో ప్రభుత్వ మార్పునకు పిలుపునిచ్చారని, అందులో నేహా బోరా కూడా ఉన్నారని ఆరోపించారు.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ మార్పును కోరుకోవ డంలో తప్పులేదని నేహా బోరా తరపు న్యాయవా ది పేర్కొనగా, ప్రభుత్వ మార్పు ఎన్నికల ద్వారా జరగాలని, వీధుల్లో గుంపులుగా చేరి నిరసనలు చేపట్టడం ద్వారా కాదని ప్రభుత్వ న్యాయవాది వాదించారు. ఇరుపక్షాల వాదనల అనంతరం నేహా బోరా పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది.

ప్రపంచ రికార్డుల మోత.. 100 పతకాల మార్క్ దాటిన భారత్

- ఏషియన్ పారా గేమ్స్‌లో ఐదో రోజు భారత్‌కు స్వర్ణాల పంట
- షూటర్ మోనా అగర్వాల్ ప్రపంచ రికార్డుతో రెండో స్వర్ణం కైవసం
- అథ్లెటిక్స్‌లో ప్రపంచ రికార్డులతో సందీప్ కుమార్, హనీలకు పసిడి పతకాలు
- 100 పతకాల మైలురాయిని దాటిన భారత బృందం
- బ్యాడ్మింటన్, ఆర్చరీలోనూ భారత్‌కు స్వర్ణ పతకాలు

ఆశ్వి అప్డేట్స్

ఐచినగోయా వేదికగా జరుగుతున్న 2026 ఏషియన్ పారా గేమ్స్‌లో భారత క్రీడాకారులు విశ్వరూపం ప్రదర్శిస్తున్నారు. ఐదో రోజు మన అథ్లెట్లు ప్రపంచ రికార్డుల మోత మోగించి స్వర్ణాల వర్షం కురిపించారు. ఈ అద్భుత ప్రదర్శనతో భారత్ పతకాల సంఖ్య 100 మైలురాయిని దాటింది.

షూటింగ్‌లో మోనా అగర్వాల్ అద్భుతం చేసింది. మహిళల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ ఎస్‌హెచ్1 విభాగంలో 357.5 స్కోరుతో ప్రపంచ రికార్డు సృష్టించి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ గేమ్స్‌లో ఆమెకు ఇది రెండో స్వర్ణం కావడం విశేషం. చైనా క్రీడాకారిణి కుయిపింగ్ జాంగ్‌పై 3.8 పాయింట్ల భారీ ఆధిక్యంతో మోనా విజయం సాధించింది.

అథ్లెటిక్స్‌లోనూ భారత హవా కొనసాగింది. టీ44 400 మీటర్ల స్ప్రింట్‌లో సందీప్ కుమార్ కేవలం 52.28 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తి చేసి ప్రపంచ రికార్డుతో స్వర్ణం గెలుచుకున్నాడు. ఈ పతకంతో భారత్ పతకాల సంఖ్య 100 దాటింది. ఇదే ఈవెంట్‌లో అజయ్ కుమార్ 53.61 సెకన్లతో కాంస్య పతకం సాధించాడు. జావెలిన్ త్రో ఎఫ్37 విభాగంలో హనీ తన చివరి ప్రయత్నంలో 60.49 మీటర్లు విసిరి ప్రపంచ రికార్డు నెలకొల్పి స్వర్ణ పతకాన్ని ముద్దాడాడు.

ఇతర క్రీడల్లోనూ భారత్ సత్తా చాటింది. పురుషుల సింగిల్స్ ఎస్ఎల్3 బ్యాడ్మింటన్ ఆల్‌ఇండియన్ ఫైనల్‌లో ప్రమోద్ భగత్‌ను ఓడించి నితేష్ కుమార్ స్వర్ణం గెలుచుకోగా, ప్రమోద్ రజతంతో సరిపెట్టుకున్నాడు. పారా ఆర్చరీ పురుషుల రికర్వ్ టీమ్ ఈవెంట్‌లో హర్విందర్ సింగ్, విజయ్ సుండి ద్వయం 51 తేడాతో చైనాపై గెలిచి పసిడి పతకాన్ని కైవసం చేసుకుంది.



300వ టీ20 మైలురాయిపై భారత్ గురి.. సూర్యవంశీ రీఎంట్రీపై ఉత్కంఠ!

- న్యూజిలాండ్‌తో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే 1-0తో ఆధిక్యంలో ఉన్న భారత్
- వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ గాయంతో దూరం
- దీంతో వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు
- అతడికి అవకాశం ఇస్తే అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించే చాన్స్
- బౌలింగ్‌లో మెరుగుపడి, భారత బ్యాటర్ల దూకుడును అడ్డుకోవాలని చూస్తోన్న కివీస్



ఆశ్వి అప్డేట్స్

టీ20 ప్రపంచ ఛాంపియన్ భారత్ మరో రికార్డు ముంగిట నిలిచింది. న్యూజిలాండ్‌తో రేపు జరిగే రెండో టీ20లో బరిలోకి దిగడం ద్వారా టీమిండియా 300 అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు ఆడిన రెండో జట్టుగా చరిత్ర సృష్టించనుంది. మరోవైపు యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ తిరిగి తుది జట్టులోకి వస్తాడా? అన్నది అభిమానుల్లో ఆసక్తి రేపుతోంది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇప్పటికే 10తో ఆధిక్యంలో ఉన్న భారత్.. రెండో మ్యాచ్‌లోనూ గెలిచి ఆధిక్యాన్ని రెట్టింపు చేయాలని చూస్తోంది. తొలి టీ20లో ఇదే హాగ్లీ ఓవల్ మైదానంలో భారీ లక్ష్యాన్ని ఛేదించి గెలిచిన భారత జట్టు ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగనుంది.

సూర్యవంశీకి అవకాశం దక్కేనా?

తొలి మ్యాచ్‌లో పరుగుల వరద పారించిన భారత జట్టులో బ్యాటర్లు సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, శ్రేయస్ అయ్యర్, నమన్ ధీర్ కీలక పాత్ర పోషించారు. న్యూజిలాండ్ నిర్దేశించిన 226 పరుగుల లక్ష్యాన్ని ఛేదించి భారత్ టీ20ల్లో తన అత్యధిక విజయవంతమైన ఛేదనను నమోదు చేసింది. అయితే రెండో మ్యాచ్‌కు ముందు వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ గాయంతో దూరమయ్యాడు. కుడి తొడ కండరానికి స్వల్ప గాయం కావడంతో అతడు ఈ మ్యాచ్ ఆడటం లేదు. దీంతో వైభవ్ సూర్యవంశీకి తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు పెరిగాయి. అతడికి అవకాశం ఇస్తే అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించే వీలుంది. అప్పుడు సంజూ శాంసన్ మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉంటుంది. అయితే తుది జట్టు కూర్పుపై భారత జట్టు యాజమాన్యం ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

అదే పిచ్.. బౌలర్లకు సవాలే!

తొలి టీ20లో రెండు జట్లూ కలిసి భారీగా పరుగులు సాధించడంతో మరోసారి బ్యాటర్ల ఆధిపత్యం కనిపిస్తుందా? అన్న చర్చ సాగుతోంది. అదే మైదానం, అదే పిచ్‌పై మ్యాచ్ జరగనుండటంతో పరిస్థితులు బ్యాటర్లకు అనుకూలించే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే ఒక మ్యాచ్ జరగడంతో పిచ్‌పై అరిగిపోయిన భాగాలు బౌలర్లకు కొంత సహకరించవచ్చని తెలుస్తోంది. తొలి మ్యాచ్‌లో భారీ స్కోరు చేసిన న్యూజిలాండ్.. చివరి వరకు పోరాడినా ఓటమి తప్పించుకోలేకపోయింది. ఈసారి బౌలింగ్‌లో మెరుగుపడి, భారత బ్యాటర్ల దూకుడును అడ్డుకోవాలని కివీస్ భావిస్తోంది. వరుసగా రెండో ఓటమి ఎదురైతే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తిరిగి పుంజుకోవడం ఆ జట్టుకు కష్టమవుతుంది. ముఖ్యంగా భారత టాప్ ఆర్డర్‌ను త్వరగా కట్టడి చేయడం న్యూజిలాండ్‌కు కీలకం కానుంది.

300వ మ్యాచ్‌లో భారత్ రికార్డు ఏంటి?

అంతర్జాతీయ టీ20ల్లో ఇప్పటివరకు 299 మ్యాచ్‌లు ఆడిన భారత్.. 300వ మ్యాచ్‌తో ఈ ఘనత సాధించిన రెండో జట్టుగా నిలవనుంది. పాకిస్తాన్ 304 మ్యాచ్‌లతో ఈ జాబితాలో ముందుంది. టీమిండియా ఇప్పటివరకు 199 మ్యాచ్‌ల్లో సాధారణ విజయాలు నమోదు చేయగా, సూపర్ ఓవర్, బౌల్ అవుట్ ద్వారా వచ్చిన విజయాలను కలుపుకొని మొత్తం 205 విజయాలు సాధించింది. ఈ చారిత్రక మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌లో ఆధిక్యాన్ని పెంచుకోవాలని శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత్ పట్టుదలగా ఉంది. మరోవైపు స్వదేశంలో సిరీస్‌ను సమం చేయాలంటే న్యూజిలాండ్‌కు ఈ మ్యాచ్ కీలకం. శనివారం మధ్యాహ్నం 12.30 గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం, సోనీ లివ్ యాప్, వెబ్‌సైట్‌లో లైవ్ స్ట్రీమింగ్ అందుబాటులో ఉంటాయి.

రెండో టీ20కి ముందు టీమిండియాకు ఎదురుదెబ్బ..

- న్యూజిలాండ్‌తో రెండో టీ20 నుంచి ఇషాన్ కిషన్ ఔట్
- గజ్జల్లో గాయం కారణంగా దూరమైనట్లు అధికారికంగా ప్రకటించిన బీసీసీఐ
- ఇషాన్ గాయం వల్లే తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్ ఆర్డర్ మార్చామని చెప్పిన కోచ్
- అతని స్థానంలో వైభవ్ సూర్యవంశీ తుది జట్టులోకి వచ్చే అవకాశం
- వెస్టిండీస్ సిరీస్ నుంచి బెంచ్‌కే పరిమితమైన యువ సంచలనం



ఆశ్వి అప్డేట్స్

న్యూజిలాండ్‌తో జరుగుతున్న టీ20 సిరీస్‌లో భారత జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. కీలక ఆటగాడు, వికెట్ కీపర్ బ్యాటర్ ఇషాన్ కిషన్ గాయం కారణంగా రేపు జరగనున్న రెండో టీ20 మ్యాచ్‌కు దూరమయ్యాడు. అతని గజ్జల్లో స్వల్ప గాయమైనట్లు బీసీసీఐ అధికారికంగా ధ్రువీకరించింది. ఈ పరిణామంతో చాలాకాలంగా తుది జట్టులో చోటు కోసం ఎదురుచూస్తున్న యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ టీమ్‌లోకి వచ్చే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి.

నిన్న హేగ్లీ ఓవల్ వేదికగా విలేకరులతో మాట్లాడిన భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్, ఇషాన్ కిషన్ గాయం గురించి కీలక విషయాలు వెల్లడించారు. తొలి టీ20లో తిలక్ వర్మను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు పంపడంపై వస్తున్న ఊహాగానాలకు సితాన్షు తెరదించారు. "ఇషాన్ కిషన్‌కు గజ్జల్లో నొప్పిగా ఉండటం వల్లే బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేయాల్సి వచ్చింది. దీనిపై చాలామంది రకరకాలుగా మాట్లాడుకోవడం నేను చూశాను. అతను రేపటి మ్యాచ్‌లో ఆడే అవకాశం కూడా తక్కువే" అని సూచనప్రాయంగా తెలిపారు.

కోచ్ వ్యాఖ్యలు చేసిన కొద్దిసేపటికే, బీసీసీఐ ఈ విషయంపై అధికారిక ప్రకటన విడుదల చేసింది. "తొలి టీ20 మ్యాచ్ సందర్భంగా ఇషాన్ కిషన్ కుడివైపు గజ్జల్లో స్వల్ప గాయమైంది. దీంతో అతను రెండో టీ20కి అందుబాటులో ఉండడు. బీసీసీఐ వైద్య బృందం అతని పర్యవేక్షిస్తోంది" అని తమ ప్రకటనలో పేర్కొంది.

వెస్టిండీస్‌తో జరిగిన టీ20 సిరీస్ మొత్తానికీ, న్యూజిలాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లోనూ వైభవ్ సూర్యవంశీ బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఇప్పుడు ఇషాన్ కిషన్ గాయపడటంతో జట్టు యాజమాన్యం అతనికి అవకాశం ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇషాన్ స్థానంలో సూర్యవంశీకి తుది జట్టులో చోటు దక్కడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. దీంతో రేపటి మ్యాచ్‌లో భారత జట్టులో మార్పులు ఖాయమయ్యాయి.

నమన్ ధీర్ అద్భుతమైన ప్లేయర్.. జట్టు ఏం కోరుకుంటుందో అతడికి తెలుసు

- నమన్ ధీర్ బహుముఖ ప్రతిభ జట్టుకు సమతూకాన్ని ఇస్తోందన్న బ్యాటింగ్ కోచ్ కోటక్
- తొలి టీ20లో 15 బంతుల్లో అజేయంగా 42 పరుగులు చేసిన నమన్
- న్యూజిలాండ్‌పై 226 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన భారత్
- సంజూ శాంసన్, అభిషేక్ శర్మల భయంలేని బ్యాటింగ్‌ను ప్రశంసించిన కోటక్
- అధిక అంచనాలు వైభవ్ సూర్యవంశీపై ఒత్తిడి కలిగిస్తాయన్న కోటక్



ఆశ్వి అప్డేట్స్

భారత యువ ఆల్‌రౌండర్ నమన్ ధీర్‌పై బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ ప్రశంసలు కురిపించాడు. జట్టులో తన పాత్ర ఏంటో అతడికి స్పష్టంగా తెలుసని, అందుకు తగ్గట్టుగానే రాణిస్తున్నాడని అన్నాడు. బౌలింగ్, ఫీల్డింగ్‌తో పాటు చివర్లో వేగంగా పరుగులు సాధించగల సామర్థ్యం అతడికి ఉందని, ఇది జట్టుకు సమతూకాన్ని ఇస్తుందని పేర్కొన్నాడు.

న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టీ20లో భారత్ నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించడంలో నమన్ కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. 226 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో కేవలం 15 బంతుల్లోనే అజేయంగా 42 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. మరో రెండు బంతులు మిగిలి ఉండగానే భారత్ లక్ష్యాన్ని చేరుకుంది. టీ20ల్లో భారత్‌కు ఇదే అత్యధిక లక్ష్య ఛేదన కావడం విశేషం.

ఈ మ్యాచ్ నేపథ్యంలో మీడియాతో మాట్లాడిన కోటక్.. నమన్ ప్రతిభపై విశ్వాసం వ్యక్తం చేశాడు. గత మ్యాచ్‌లో చివరి ఆరు నుంచి ఎనిమిది బంతుల్లో అతడు ఆడిన తీరు తన సామర్థ్యానికి నిదర్శనమని అన్నాడు.

"నమన్ చాలా ఆసక్తికరమైన ప్రతిభావంతుడు. అతడు పవర్‌ఫుల్ ఆటగాడు. జట్టు తన నుంచి ఏం ఆశిస్తుందో తెలుసు. దానికి తగ్గట్టుగానే ఆడుతున్నాడు. ఇది చాలా మంచి సంకేతం" అని కోటక్ పేర్కొన్నాడు.

ప్రత్యర్థి జట్టులో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఎక్కువగా ఉంటే నమన్‌తో నాలుగు ఓవర్లు బౌలింగ్ చేయించవచ్చని, ఎడమ, కుడిచేతి వాటం బ్యాటర్లు సమానంగా ఉంటే ఒకటి లేదా రెండు ఓవర్లు వేయించవచ్చని వివరించాడు. మంచి ఫీల్డర్‌గా, ఫినిషర్‌గా కూడా అతడు జట్టుకు ఉపయోగపడతాడన్నాడు. బ్యాటింగ్‌లో అతడి టెక్నిక్, క్రీజులో నిలదొక్కుకునే విధానం, పవర్, షార్ట్ బాల్స్‌ను ఎదుర్కొనే తీరు ఆకట్టుకుంటున్నాయని చెప్పాడు.

తొలి మ్యాచ్‌లో సంజూ శాంసన్ 33 బంతుల్లో 67 పరుగులు చేయగా, అభిషేక్ శర్మతో కలిసి పవర్‌ప్లేలోనే 93 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 28 బంతుల్లో 42 పరుగులు చేశాడు. ఒత్తిడిలోనూ భయం లేకుండా సంజూ, అభిషేక్ ఆడిన తీరు తనను ఆకట్టుకుందని కోటక్ తెలిపాడు.

వరుసగా రెండు మ్యాచ్‌ల్లో త్వరగా ఔటైతే, మూడో మ్యాచ్‌లోనూ వికెట్ కోల్పోతానేమోనన్న భయం బ్యాటర్లలో ఉండవచ్చని చెప్పాడు. అయినప్పటికీ సంజూ, అభిషేక్ దూకుడుగా ఆడుతూ తమ ఆటపై నియంత్రణ చూపిస్తున్నారని ప్రశంసించాడు.

ఇదిలా ఉండగా, గజ్జల్లో గాయం కారణంగా ఇషాన్ కిషన్ రెండో టీ20కి దూరమయ్యాడు. దీంతో 15 ఏళ్ల యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ తుది జట్టులోకి వచ్చే అవకాశాలు ఉన్నట్లు అంచనాలు వెలువడుతున్నాయి. అయితే, అతడికి ఎప్పుడు అవకాశం ఇవ్వాలనే అంశంపై కోటక్ స్పష్టమైన హామీ ఇవ్వలేదు.

వైభవ్‌పై తొలి నుంచే ఎక్కువ అంచనాలు పెట్టడం మంచిది కాదని కోటక్ అభిప్రాయపడ్డారు. "అతడు చాలా ప్రతిభావంతుడు. భవిష్యత్తు ఉజ్వలంగా ఉంది. కానీ అందరూ అతడిని ఇష్టపడుతున్నారని, ఆడించాలని కోరుకుంటున్నారని తుది జట్టులో మార్పులు చేయలేం. జట్టులో ఆడే 11 మందినే ఎంపిక చేయాలి" అని అన్నారు.

ప్రారంభంలో వైభవ్ ఆడాలంటూ వచ్చిన హైప్ యువ ఆటగాడిపై అనవసర ఒత్తిడి పెంచిందని చెప్పాడు. ప్రస్తుతం అతడు మరింత పరిణతి సాధించాడని, జట్టులోని పోటీని అర్థం చేసుకుంటున్నాడని తెలిపాడు. ఫీల్డింగ్, ఫిట్‌నెస్, బ్యాటింగ్‌పై కృషి చేస్తున్నాడని, సీనియర్ ఆటగాళ్లు ఎలా ఆడుతున్నారో గమనిస్తూ నేర్చుకుంటున్నాడని వివరించాడు.

వైభవ్ సహజమైన దూకుడును మార్చే ఉద్దేశం తనకు లేదని కోటక్ స్పష్టం చేశాడు. బంతి పరిస్థితిని బట్టి ఏ షాట్లు ఆడాలో తెలుసుకోవడంపై అతడితో చర్చించినట్లు తెలిపాడు. బంతి ఎక్కడ పడినా షాట్లు సృష్టించేందుకు ప్రయత్నించే ఆటగాళ్లకు భిన్నంగా, వైభవ్ తనకు అనుకూలంగా ఆటను శాసిస్తూ షాట్లు ఆడగలడని ప్రశంసించాడు.

ఫిట్‌నెస్ సాధిస్తే తీసుకుంటామన్నారు.. తర్వాత ఫోన్ ఎత్తలేదు.. మెసేజ్‌కు రిప్లై ఇవ్వలేదు

- జట్టులోకి తిరిగి వస్తావని కోహ్లీ హామీ ఇచ్చాడని అమిత్ మిశ్రా వెల్లడి
- గాయం నుంచి కోలుకున్నాక ఫోన్‌లు, సందేశాలకు కోహ్లీ స్పందించలేదని ఆరోపణ
- అప్పటి కోచ్ అనిల్ కుంబ్లే కూడా పునరాగమనంపై భరోసా ఇచ్చాడని వెల్లడి
- 2017లో ఇంగ్లాండ్‌తో టీ20 మ్యాచ్‌లో గాయపడిన మిశ్రా
- బెంగళూరులో జరిగిన ఆ మ్యాచ్ తన చివరి అంతర్జాతీయ మ్యాచ్ అయిందని వెల్లడి

ఆశ్వి అప్డేట్స్

టీమిండియాలోకి తిరిగి వస్తావంటూ విరాట్ కోహ్లీ హామీ ఇచ్చాడని, పూర్తిగా ఫిట్‌నెస్ సాధించిన తర్వాత తన ఫోన్లు, సందేశాలకు మాత్రం స్పందించలేదని భారత మాజీ లెగ్ స్పిన్నర్ అమిత్ మిశ్రా వెల్లడించాడు. అప్పటి కోచ్ అనిల్ కుంబ్లే కూడా గాయం నుంచి కోలుకున్నాక జట్టులోకి తిరిగి వస్తావని భరోసా ఇచ్చాడని చెప్పాడు. అయితే, ఆ హామీలు ఆచరణలోకి రాలేదని పేర్కొన్నాడు.

ఆకాశ్ చోప్రాతో కలిసి 'బైత్ అండ్ బోల్' పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న మిశ్రా ఈ విషయాలను వెల్లడించాడు. 2017లో బెంగళూరులో ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 మ్యాచ్‌లో గాయపడటం తన అంతర్జాతీయ కెరీర్‌పై ప్రభావం చూపిందని చెప్పాడు. అదే భారత్ తరఫున తనకు చివరి అంతర్జాతీయ మ్యాచ్ అయిందని తెలిపాడు.

ఆ మ్యాచ్‌లో కాలికి గాయమైన తర్వాత అప్పటి కోచ్ అనిల్ కుంబ్లేతో మాట్లాడినట్లు మిశ్రా చెప్పాడు. గాయం నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత జట్టులోకి తిరిగి వస్తావని కుంబ్లే భరోసా ఇచ్చాడని గుర్తుచేసుకున్నాడు.

ఆ తర్వాత కెప్టెన్‌గా ఉన్న విరాట్ కోహ్లీని కూడా సంప్రదించినట్లు తెలిపాడు. ఏం చేయాలని అడిగితే.. పూర్తిగా ఫిట్‌నెస్ సాధించి సిద్ధంగా ఉంటే జట్టులోకి వస్తావని కోహ్లీ చెప్పినట్లు మిశ్రా వెల్లడించాడు.

గాయం నుంచి కోలుకున్న తర్వాత కోహ్లీని మళ్లీ సంప్రదించి తన పునరాగమనంపై పరిస్థితి ఏంటని అడిగానని చెప్పాడు. వారం నుంచి పది రోజుల్లో సమాచారం ఇస్తానని కోహ్లీ చెప్పినట్లు తెలిపాడు. అయితే, వారం, రెండు వారాలు, మూడు వారాలు గడిచినా ఎలాంటి సమాధానం రాలేదని మిశ్రా అన్నాడు.

"ఫోన్ చేశాను. అతడు ఎత్తలేదు. సందేశం పంపినా స్పందన లేదు. మళ్లీ ఫోన్ చేశాను. అయినా సమాధానం రాలేదు. చివరకు నేనే వదిలేశాను. మనల్ని జట్టులోకి తీసుకోవాలని ఎవరికీ లేకపోతే మనం ఏం చేయగలం?" అని మిశ్రా ఆవేదన వ్యక్తం చేశాడు.

తనకంటే తీవ్రంగా గాయపడి, ఎక్కువ కాలం ఆటకు దూరంగా ఉన్న కొందరు ఆటగాళ్లు ఫిట్‌నెస్ సాధించగానే జట్టులోకి తిరిగి వచ్చారని మిశ్రా పేర్కొన్నాడు. కానీ తన విషయంలో అలా జరగలేదని, ఇప్పటివరకు తనకు ఎలాంటి సమాధానం రాలేదని చెప్పాడు.





రణ్‌బీర్ కపూర్ క్షమాపణలు

ఇటీవల దసరా వేడుకల్లో బాలీవుడ్ హీరో రణ్‌బీర్ కపూర్ చేసిన వ్యాఖ్యలతో సోషల్ మీడియాలో విమర్శలు ఎదురయ్యాయి. దీంతో తాజాగా ఆయన ఈ వివాదంపై స్పందించి క్షమాపణలు తెలిపారు. తన మాటలను తప్పుగా అర్థం చేసుకోవద్దని, అది అనుకోకుండా జరిగిన పొరపాటు మాత్రమేనని వివరణ ఇచ్చారు. చెన్నైలో 'రామాయణ' చిత్ర ప్రచార కార్యక్రమాల్లో దీనిపై స్పందించారు. ''నిన్నటి దసరా వేడుకలో జరిగిన సంఘటనకు క్షమాపణ కోరుతున్నాను. నోరు జారి తప్పుగా మాట్లాడాను. చెడు ఎంత శక్తిమంతం అయినప్పటికీ చివరికి సత్యం, మంచితనమే గెలుస్తాయి అనే చెప్పాలనుకున్నాను. నేను చెప్పాలనుకున్న దాన్ని నా మాటలే మార్చేశాయి. ఆ పొరపాటుకు నిజంగా క్షమాపణ కోరుతున్నాను'' అని ఆయన తెలిపారు. ఇటీవల కోల్‌కతాలో జరిగిన ఈ సినిమా ప్రచార కార్యక్రమంలో భాగంగా దసరా వేడుకలో పాల్గొన్న రణ్‌బీర్ పండగ సందేశం గురించి మాట్లాడుతూ.. ''దసరా మనకు ఒక అందమైన విషయాన్ని గుర్తుచేస్తుంది. చెడు ఎంత శక్తిమంతం అయినప్పటికీ చివరికి సత్యం, మంచితనం అంతమైపోతాయి(అంటే చెడు గెలుస్తుందని అర్థం వచ్చేలా)'' అన్నారు. దాంతో ఆయన పొరపాటున తప్పుగా మాట్లాడినందుకు క్షమాపణలు కోరారు. రణ్‌బీర్ రాముడి పాత్రలో కనిపించనున్న 'రామాయణ' చిత్రం నవంబరు 5న థియేటర్లలో విడుదల కానుంది.




హాలీవుడ్ సినిమా చేయాలనుంది.. 'వారణాసి'పై రాజమౌళి కీలక అప్‌డేట్!

అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి (SS Rajamouli) హాలీవుడ్ ఎంట్రీపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కనీసం ఒక్క హాలీవుడ్ సినిమా అయినా చేయాలనుందని వెల్లడించారు. బ్రెజిల్‌లో జరుగుతున్న 50వ సావో పాలో అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ఆయన పాల్గొన్నారు. తన తదుపరి చిత్రం 'వారణాసి' (Varanasi), హాలీవుడ్ ఆఫర్ల గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. 'ఆర్ఆర్ఆర్' (RRR) ఘనవిజయం తర్వాత తనకు హాలీవుడ్ నుంచి చాలా ఆఫర్లు వచ్చాయని తెలిపారు.

''నాకు హాలీవుడ్ నుంచి చాలా ఆఫర్లు వచ్చాయి. అక్కడి పనితీరు, నిర్మాణాత్మక శైలి ఎంతో అద్భుతంగా ఉంటుంది. నేను నేర్చుకోవాల్సింది చాలా ఉంది. అందుకే హాలీవుడ్‌లో కనీసం ఒక్క సినిమా అయినా చేయాలని కోరుకుంటున్నాను. 'ఆర్ఆర్ఆర్' తర్వాతే నాకు ఈ ఆఫర్లు వచ్చాయి. కానీ అప్పటికే నా తదుపరి ప్రాజెక్టు 'వారణాసి' పనులు మొదలయ్యాయి. ఒకేసారి రెండు, మూడు ప్రాజెక్టులపై పనిచేయలేను. ఒక సినిమా పూర్తిగా పూర్తయిన తర్వాతే నా దృష్టి మరో సినిమాపై పెడతాను. 'వారణాసి' ప్రాజెక్టు పూర్తయ్యాక హాలీవుడ్ ఆఫర్ల గురించి కచ్చితంగా ఆలోచిస్తాను'' అని రాజమౌళి స్పష్టం చేశారు

మహేశ్ బాబు (Mahesh babu), ప్రియాంక చోప్రా (Priyanka chopra), పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'. యాక్షన్ అడ్వెంచర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా చిత్రీకరణపై రాజమౌళి కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఈ మూవీ షూటింగ్ మరో 10 రోజులు మాత్రమే బ్యాలెన్స్ ఉందని ఆయన వెల్లడించారు. రాజమౌళి దర్శకత్వం వహిస్తున్న ఈ భారీ చిత్రానికి ఆయన తండ్రి వి.విజయేంద్ర ప్రసాద్. ఎస్.ఎస్. కంచి స్క్రీన్‌ప్లే అందించారు. ఈ చిత్రం 2027 ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో భారీ స్థాయిలో విడుదల కానుంది.



ప్రీక్వెల్‌గా జాలీ ఎల్ఎల్‌బీ 4?

జగదీశ్ త్యాగి అనే న్యాయవాది జీవితం చుట్టూ తిరిగే కథ 'జాలీ ఎల్ఎల్‌బీ'. సుభాష్ కపూర్ దర్శకత్వంలో అర్షద్ వార్సీ, బోమన్ ఇరానీ తదితరులు నటించారు. ఈ చిత్రానికి కొనసాగింపుగా 'జాలీ ఎల్ఎల్‌బీ 2', 'జాలీ ఎల్ఎల్‌బీ 3'లు వచ్చాయి. ఈ రెండు సినిమాల్లో అక్షయ్ కుమార్ ప్రధాన పాత్ర పోషించారు. ప్రస్తుతం ఈ చిత్ర ఫ్రాంచైజీలో రానున్న నాలుగో భాగంలో చురుకైన న్యాయవాది అయిన జగదీశ్ త్యాగి పాత్రలో బాలీవుడ్ నటుడు అర్షద్ వార్సీ తిరిగి నటించనున్నట్లు తెలుస్తోంది. దీనికి ఉమేశ్ శుక్లా దర్శకత్వం వహించనున్నారట. ఈ కోర్ట్‌రూమ్ కామెడీ డ్రామా మునుపటి చిత్రాల కథను కొనసాగించకుండా ఒక ఉత్కంఠభరితమైన ప్రీక్వెల్‌గా రూపొందించనున్నట్లు సమాచారం. "ప్రస్తుతం ఈ ప్రాజెక్టు ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. 2027 జనవరి నాటికి ఈ సినిమా చిత్రీకరణ పూర్తి కానుంద"ని బాలీవుడ్ సినీవర్గాలు తెలిపాయి. 'జాలీ ఎల్ఎల్‌బీ'లో అర్షద్ వార్సీ.. జగదీశ్ త్యాగి అనే పాత్రను పోషించారు. మరోసారి అదే పాత్రలో ప్రేక్షకుల్ని ఎలా మెప్పించనున్నారో తెలియాలంటే కొన్ని రోజులు వేచి చూడాల్సిందే.



చదువును ఇంత ఆసక్తికరంగా మార్చడం మీకే సాధ్యం

బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ (Hrithik Roshan) ప్రముఖ విద్యావేత్త ఆనంద్ కుమార్ (Anand kumar)పై ప్రశంసలు కురిపించారు. విద్యను అందరికీ చేరువ చేసేలా ఆనంద్ కుమార్ కొత్తగా ప్రారంభించిన 'సూపర్ ఇన్ఫినిటీ' (Super Infinity) కార్యక్రమానికి హృతిక్ శుభాకాంక్షలు తెలిపారు. దీనిపై హృతిక్ తన సోషల్ మీడియాలో స్పందిస్తూ ఓ పోస్ట్ పెట్టారు.

''సూపర్ ఇన్ఫినిటీ అనే మరో అద్భుతమైన కార్యక్రమం చేపట్టినందుకు శుభాకాంక్షలు ఆనంద్ సర్. చదువును ఇంత సరదాగా.. ఆసక్తికరంగా మార్చడం మీకే సాధ్యం. హ్యాట్సాఫ్'' అని రాసుకొచ్చారు. హృతిక్ పోస్ట్‌కు ఆనంద్ కుమార్ స్పందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ''ధన్యవాదాలు హృతిక్ జీ.. నా సూపర్30 ప్రయాణాన్ని మీరు వెండితెర ద్వారా కోట్ల మందికి చేరువ చేశారు. గణితాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతి చిన్నారికి సులభంగా నేర్పించాలనే నా కలను ముందుకు తీసుకెళ్లేందుకు మీ ప్రోత్సాహం మరింత బలాన్నిచ్చింది'' అని పేర్కొన్నారు.

పేద విద్యార్థులకు ఐఐటీజేఈఈ ఉచిత కోచింగ్ ఇచ్చేందుకు ఆనంద్ కుమార్ గతంలో 'సూపర్ 30' కార్యక్రమాన్ని ప్రారంభించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. విద్యా రంగంలో ఆయన చేసిన సేవలకు గానూ కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఆయన జీవిత కథ ఆధారంగా వికాస్ బహ్ల్ దర్శకత్వంలో 'సూపర్ 30' అనే చిత్రం తెరకెక్కింది. ఇందులో ఆనంద్ కుమార్ పాత్రలో హృతిక్ రోషన్ నటించారు. ఇప్పుడు ఆన్‌లైన్ ద్వారా మరింత మందికి చేరువయ్యేందుకు ఆనంద్ కుమార్ సరికొత్త అడుగు వేశారు. విద్యార్థులకు చదువును మరింత ఆసక్తికరంగా మార్చేందుకు యూట్యూబ్ ద్వారా ఈ 'సూపర్ ఇన్ఫినిటీ'కి శ్రీకారం చుట్టారు. నాణ్యమైన విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావడమే దీని లక్ష్యమని ఆయన తెలిపారు.




టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు వరుస సినిమాలతో దూసుకుపోతూ నేషనల్ క్రష్‌గా గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ రష్మిక మందన్న తాజాగా, ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి. గ్లామర్ ఇండస్ట్రీలో ఎంత పేరు ప్రఖ్యాతలు ఉన్నప్పటికీ, తనకంటూ కొన్ని హద్దులు ఉంటాయని, వాటిని దాటి గ్లామర్ షో చేయడానికి తాను ఎప్పుడూ ఒప్పుకోనని తేల్చి చెప్పేసింది. కొన్నిసార్లు కథ డిమాండ్ మేరకు లేదా పాత్ర కోసం బికినీ లాంటి మోడ్రన్ దుస్తులు వేసుకోవాల్సిన అవసరం రావొచ్చని.. కానీ అటువంటి సందర్భాల్లో కూడా మరీ ఎక్కువగా ఒళ్లు కనిపించేలా డ్రెస్సులు ధరించడం తనకు అస్సలు ఇష్టం ఉండదని ఆమె స్పష్టం చేశారు. తాను అలాంటి మనస్తత్వం ఉన్న అమ్మాయిని కాదని, ఏ సినిమా మొదలయ్యే ముందే ఈ విషయాలన్నీ డైరెక్టర్‌కి, చిత్ర బృందానికి చాలా స్పష్టంగా చెప్పేస్తానని క్లారిటీ ఇచ్చింది.

కొన్నిసార్లు కమర్షియల్ సినిమాల్లో కొన్ని ప్రత్యేక పాటల కోసం లేదా సన్నివేశాల కోసం తనకు పూర్తిగా సౌకర్యవంతంగా లేని బట్టలు వేసుకోవాల్సిన పరిస్థితులు ఎదురవుతుంటాయని తెలిపారు. కానీ అలాంటి వాటికి తాను దూరంగా ఉంటానని, తన పరిమితులు ఏమిటో ముందే మేకర్స్‌కి ముఖం మీదే చెప్పేస్తానని వివరించింది. నటీనటుల సౌకర్యాన్ని, వాళ్ళ వ్యక్తిగత నిర్ణయాలను గౌరవించే దర్శకులు, నిర్మాతలతో మాత్రమే పనిచేయడానికి తాను ఇష్టపడతానని.. అలా కాదని గ్లామర్ దుస్తులు ధరించమంటే ఊరుకునేది లేదని తేల్చి చెప్పారు . ఎవరి ఒత్తిడికీ తలవంచకుండా తనకంటూ ఒక స్టైల్ మెయింటైన్ చేస్తున్న రష్మిక వ్యాఖ్యలను ఆమె అభిమానులు తెగ మెచ్చుకుంటున్నారు.

ఒళ్లు చూపించే డ్రెస్సులు వేసుకోమ ఊరుకునేది లేదు..



ఆ కష్టమైన పాత్ర కోసమే కలలు కన్నాను..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, డైరెక్టర్ హను రాఘవపూడి కాంబోలో తెరకెక్కుతున్న భారీ పిరియాడికల్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'. మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తుండగా.. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అయితే ఈ క్రేజీ ప్రాజెక్ట్‌లో '418' ఫేమ్ కన్నడ బ్యూటీ చైత్ర అచార్ కూడా ఓ వైవిధ్యమైన పాత్రలో నటిస్తోంది. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె ఈ సినిమా విశేషాలతో పాటు ప్రభాస్‌తో పనిచేసిన అనుభవాన్ని ఆమె పంచుకున్నారు. డైరెక్టర్ హను రాఘవపూడి తనకు ఫోన్ చేసి 'ఫౌజీ' గురించి చెప్పిన క్షణాలను చైత్ర గుర్తుచేసుకున్నారు. తనను ఎందుకు పిలిచారో మొదట్లో అర్థం కాలేదని, కానీ నా క్యారెక్టర్ నెరేషన్ విన్నాక ఫిదా అయిపోయానని ఆమె తెలిపారు. శారీరకంగా, మానసికంగా ఎంతో కష్టపడే ఇలాంటి రోల్‌లో నటించాలని ఎప్పుడో కలలు కన్నానని, వందలాది మందితో కూడిన ఇంతటి భారీ కమర్షియల్ సెట్‌లో పనిచేయడం తనకు ఇదే మొదటిసారంటూ చెప్పుకొచ్చారు. ఇక డార్లింగ్ ప్రభాస్ గురించి చెబుతూ.. ఆయన చాలా మంచివారని, ముద్దులొలికే అమాయకత్వం ఆయన సొంతమని, అందుకే అందరూ ఆయన్ని డార్లింగ్ అంటారని అన్నారు. ఆయనకు తినడం ఇష్టమని, తోటివారికి ప్రేమగా తినిపించడం అంతకంటే ఇష్టమని తెలిపారు. అంతేకాకుండా, ప్రభాస్ తనను ఎంతగానో ప్రోత్సహించారని చెబుతూ.. తాను నటించకపోయినా తన సీన్స్ ఫుటేజ్ చూసి, నీ యాక్టింగ్‌కి థియేటర్లలో విజిల్స్ పడతాయని అప్రిషియేట్ చేశారని చెప్పుకొచ్చారు.

యువ నటుడు తేజ సజ్జా (Teja Sajja) త్వరలో పెళ్లి చేసుకోబోతున్నారంటూ ప్రచారం జరుగుతున్న సంగతి తెలిసిందే. దీనిపై ఆయన క్లారిటీ ఇచ్చారు. డిసెంబరులో రాజస్థాన్‌లోని ఉదయ్‌పుర్‌లో తాను డెస్టినేషన్ వెడ్డింగ్ చేసుకోబోతున్నట్లు వెల్లడించారు. నవంబరులో నిశ్చితార్థం చేసుకోబోతున్నట్లు పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో వివాహ వేడుక జరుగుతుందన్నారు. ఆ తరువాత హైదరాబాద్‌లో రిసెప్షన్ నిర్వహిస్తామన్నారు. తమది పెద్దలు కుదిర్చిన సంబంధమని, వధువు కుటుంబానికి సినీ పరిశ్రమతో సంబంధాలు లేవని తేజ చెప్పారు. వారి కుటుంబం టెక్నాలజీ వ్యాపారంలో ఉన్నట్లు తెలిపారు.

'హను-మాన్', 'మిరాయ్' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న తేజ ప్రస్తుతం 'ట్రైటర్స్' రియాలిటీ షోకు హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. 'జాంబీ రెడ్డి' సీక్వెల్‌తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు.

పెళ్లి వార్తలపై తేజ సజ్జా క్లారిటీ

నిద్ర పట్టడం లేదా.. ఈ డ్రింక్స్ ట్రై చేయండి

ఈ రోజుల్లో నిద్రపట్టకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఆఫీసులో తీవ్ర ఒత్తిడిలో పనిచేసి ఇంటికొస్తే.. ఇంట్లో కూడా సరైన నిద్రపట్టకపోతే నరకంలా ఉంటుంది. ఇక సరైన నిద్రలేకపోతే అనేక ఇతర అనారోగ్య సమస్యలు కూడా వస్తుంటాయి. అందుకే నిద్ర పట్టాలంటే కొన్ని డ్రింక్స్ సూచిస్తున్నారు ఆరోగ్య నిపుణులు. ఈ డ్రింక్స్ ఏమిటో ఇప్పుడు చూసేద్దాం..



లావెండర్ టీ

లావెండర్ మంచి సువాసనను కలిగి ఉంటుంది. ఒత్తిడి, ఆందోళనను తగ్గించడంలో సాయపడుతుంది. నిద్రకు ముందు లావెండర్ టీ తాగడం వల్ల మనస్సు, శరీరానికి విశ్రాంతి లభిస్తుంది. తద్వారా మంచి నిద్ర పడుతుంది. నిద్రకు ఒక గంట ముందు ఈ టీని తీసుకోవడం మంచిది. లావెండర్ టీ కూడా యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంది. జీర్ణ సమస్యలను తగ్గించడంలో అద్భుతంగా సాయపడుతుంది.

పిప్పరమింట్ టీ

పిప్పరమింట్ టీ రిఫ్రెష్‌గా ఉండటమే కాదు.. మీ కండరాలను రిలాక్స్ చేయడంలో సాయపడుతుంది. అలాగే, టెన్షన్‌ను తగ్గించగలదు. తద్వారా మంచి నిద్ర పడుతుంది. నిద్రపోయే ఒక గంట ముందు సాయంత్రం ఈ టీని సేవించడం ఉత్తమం. పిప్పరమింట్ టీ కూడా జీర్ణక్రియకు సాయపడుతుంది. ప్రేగు సిండ్రోమ్ లక్షణాలను కూడా తగ్గిస్తుంది.





అశ్వగంధ టీ

అశ్వగంధ అనేది అడాప్టోజెనిక్ హెర్బ్. శరీరంలో ఒత్తిడిని తగ్గించి విశ్రాంతిని కలిగిస్తుంది. కార్టిసాల్ స్థాయిలను తగ్గించే గుణాలను కలిగి ఉంటుంది. ఒత్తిడికి సంబంధించిన హార్మోన్, మంచి నిద్రను ప్రోత్సహిస్తుంది. నిద్రవేళకు ఒక గంట ముందు సాయంత్రం సమయంలో ఈ అశ్వగంధ టీని సేవించడం ఉత్తమం. అశ్వగంధ టీ మానసిక స్థితిని మెరుగుపరచడంలో అద్భుతంగా

అల్లం టీ

అల్లంలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, డైజెస్టివ్ గుణాలు ఉన్నాయి. కండరాలను రిలాక్స్ చేయడంతో పాటు మంచి నిద్రను ప్రేరేపిస్తుంది. నిద్రించే ముందు అల్లం టీ తాగడం వల్ల అజీర్ణం, ఉబ్బరం తగ్గుతుంది. ప్రశాంతమైన నిద్ర పోవచ్చు. నిద్రకు ఒక గంట ముందు సాయంత్రం ఈ అల్లం టీని సేవించాలి. అల్లం టీ కూడా వికారం తగ్గించడంతో పాటు రక్త ప్రసరణను మెరుగుపరచడంలో సాయపడుతుంది.





పసుపు పాలు

పాలు, దాల్చినచెక్క, అల్లం వంటి ఇతర సుగంధ ద్రవ్యాలతో పసుపు కలపాలి. అప్పుడు గోల్డెన్ మిల్క్ మాదిరిగా మారుతాయి. పసుపులో కర్కుమిన్ ఉంటుంది. మంచి నిద్రను అందిస్తుంది.ఇందులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు ఉంటాయి. నిద్రపోయే ముందు ఈ పసుపు పాలు తాగడం వల్ల వాపు తగ్గుతుంది. నిద్ర నాణ్యత మెరుగుపడుతుంది. నిద్రించే ఒక గంట ముందు ఈ పసుపు పాలను సేవించడం ఉత్తమం. జీర్ణక్రియను మెరుగుపరచడంతో పాటు రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా సాయపడుతుంది.

స్కిన్ క్యాన్సర్.. లక్షణాలు ఇవే..!

ఇటీవల క్యాన్సర్ బారిన పడేవారి సంఖ్య పెరుగుతోంది. స్కిన్ క్యాన్సర్ డేంజర్ బెల్స్ కూడా మోగుతున్నాయి. ఏ క్యాన్సర్ అయినా ప్రారంభదశలో గుర్తిస్తే నయం చేసుకోవచ్చు. అసలు స్కిన్ క్యాన్సర్ లక్షణాలు ఏమిటో ఈ కథనంలో తెలుసుకుందాం.. చాలా మంది పడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా స్కిన్ క్యాన్సర్ కేసులు ఎక్కువవుతున్నాయ్.



పుట్టుమచ్చలు రంగు మారుతున్నాయా?

కొందరిలో ఉన్నట్టుండి పుట్టుమచ్చల కలర్ మారుతూ ఉంటుంది. సైజు, రంగు కూడా మారుతుంటాయి. ఇలా జరిగితే పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరని డాక్టర్లు చెబుతున్నారు. అమెరికాలో చర్మవ్యాధికి సంబంధించిన అమెరికాన్ అకాడమీ ఆఫ్ డెర్మటాలజీ విభాగం వారు స్కిన్ క్యాన్సర్‌కు సంబంధించిన లక్షణాలపై స్పష్టతనిచ్చారు. 30 ఏళ్ల తరువాత చర్మంపై ఏదైనా మచ్చ వచ్చి అది క్రమంగా పెరగడం లేదా దాని రంగులో మార్పు రావడం జరుగుతుందంటున్నారు. కొత్త పుట్టుమచ్చలు వస్తే దా1నికి అప్రమత్తంగా ఉండాలని అంటున్నారు. చర్మంపై ఎప్పుడు కొత్తగా పుట్టుమచ్చలు వచ్చినా వాటిని గమనిస్తూనే ఉండాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. చర్మంపై చిన్న కురుపులా వచ్చి అది ఎన్ని రోజులైనా మానకపోతే వైద్యులను వెంటనే అప్రమత్తమై వైద్యులను సంప్రదించాలి. బాసల్ సెల్ కార్సినోమా, స్క్వామోస్ సెల్ కార్సినోమాలో ఇలాంటి లక్షణాలు కనిపిస్తాయంటున్నారు.

దురద, దుద్దుర్లు

స్కిన్ క్యాన్సర్ వచ్చినట్టయితే చర్మం ఎక్కువగా దురదపెడుతుంది. కొన్ని ప్రదేశాల్లో దద్దుర్లు వస్తాయ్. సాధారణంగా చర్మంపై కురుపులు వచ్చినా దద్దుర్లు వచ్చినా కొన్ని రోజుల్లో తగ్గిపోతాయ్. ఒక వేల ఎంతకీ తగ్గకపోతే అప్పుడు అప్రమత్తమై నివారణ చర్యలు చేపట్టాలని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

డైవర్స్ కు కారణాలివే..

ఇటీవల భార్యాభర్తలు విడాకులు తీసుకోవడం వెరీ కామన్ అయిపోయింది. చాలా సిల్లీ రీజన్స్ తో విడిపోయేవారూ ఉన్నారు. బలమైన కారణాలతోనూ దూరమయ్యేవారూ ఉన్నారు. అయితే ముఖ్యంగా ఐదు కారణాల వల్ల భార్యాభర్తలు విడిపోతున్నారని మానసిక విశ్లేషకులు చెబుతున్నారు. ఆ కారణాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం..



కమ్యూనికేషన్ గ్యాప్

చాలా జంటలు కేవలం ఒకరితోఒకరు మనసువిప్పి మాట్లాడుకోకపోవడం వల్లే విడిపోతున్నారట. ఒకరి భావాలు మరొకరు అర్థం చేసుకోకపోవడం.. భావాలను వ్యక్తపరుచుకోకపోవడం వల్ల ఒకరిని మరొకరు అర్థం చేసుకోవడంలో ఫెయిల్ అవుతున్నారంట. కమ్యూనికేషన్ గ్యాప్ విడాకులకు ప్రధాన కారణం అవుతున్నదని తెలుస్తోంది.

పరస్పర గౌరవం లేకపోవడం

భార్యాభర్తల మధ్య ఒకరిమీద మరొకరికి గౌరవం ఉండాలి. లేదంటే ఆ సంబంధం ఎక్కువ కాలం నిలబడదు. చాలా డివోర్స్ కేసుల్లో ఒకరిమీద ఒకరికి గౌరవం లేకపోవడం కూడా ఓ కారణంగా తెలుస్తోంది.

ఆర్థిక అభద్రత

డబ్బు విషయంలో భార్యాభర్తల మధ్య నిరంతరం తగాదాలు, ఖర్చులు సరిపోకపోవడం, ఆర్థిక లక్ష్యాలను చేరుకోలేకపోవడం - ఇవన్నీ ఇద్దరు వ్యక్తుల మధ్య చాలా ఉద్రిక్తతను పెంచుతాయి, తద్వారా సంబంధాన్ని కాపాడుకోవడం కష్టం అవుతుంది.

కుటుంబ జోక్యం

భార్యాభర్తల మధ్య విబేధాలు రావడానికి కుటుంబసభ్యుల అతి జోక్యం కూడా ఓ కారణం అవుతోంది. భార్య తరపు వాళ్లు, లేదంటే భర్త తరపు వాళ్లు.. ఇలా ఇద్దరి తరపు వాళ్లు విబేధాలకు కారణం అవుతున్నారు. భార్య ప్రతి విషయానికి తన తల్లి లేదా సోదరి మీద ఆధారపడటం.. భర్త సైతం ప్రతి విషయానికి తన తల్లిదండ్రుల మీద డిపెండ్ అవ్వడం.. వాళ్లు కూడా అతి జోక్యం చేసుకుంటుండటంతో విబేధాలు తారస్థాయికి చేరుతున్నాయి. వీరి వ్యవహారశైలి కూడా

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S